తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల కామారెడ్డి

పెద్దపల్లి | జగిత్యాల

బుధవారం

14 అక్టోబర్ 2026

పేజీలు : 8

Follow :




# కేసుల దర్యాప్తులో నాణ్యతే లక్ష్యం..

## బాధితులకు సత్వర న్యాయం అందించాలి

❍ఎఫ్ఐఆర్ నుంచి చార్జ్‌షీట్ వరకు ప్రతి అంశాన్ని పక్కాగా నమోదు చేయాలి

❍పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర దిశానిర్దేశం



కామారెడ్డి, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 (జనం సాక్షి)

కేసుల దర్యాప్తులో నాణ్యత, ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు పోలీసు సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ సూచించారు. కేసుల నమోదు నుంచి దర్యాప్తు పూర్తిచేసి చార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు ప్రతి అంశాన్ని స్పష్టంగా, సమగ్రంగా నమోదు చేయాలని ఆదేశించారు.కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, సీఐ, డీఎస్పీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న రైటర్లకు కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన రైటర్లతో ఎస్పీ స్వయంగా మాట్లాడి, శిక్షణలో నేర్చుకున్న అంశాలు, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియలపై వారికి ఉన్న అవగాహనను అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను విధి నిర్వహణలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

**దర్యాప్తులో పొరపాట్లకు తావివ్వకూడదు**

ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటి నుంచి చార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు కేసుకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం నమోదు చేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. సాక్షులు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను వాస్తవాల ఆధారంగా నమోదు చేయడంతో పాటు, సాక్ష్యాధారాల సేకరణ, భద్రపరచడం, కేసు వివరాల నమోదు వంటి ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. దర్యాప్తులో చిన్నపాటి పొరపాట్లకు కూడా అవకాశం ఇవ్వకుండా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు.

**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి**

ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక పోలీసింగ్ విధానాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. కేసుల దర్యాప్తులో పారదర్శకత, ఖచ్చితత్వం పాటిస్తూ బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా పనిచేయాలని తెలిపారు. పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా ప్రతి ఒక్కరూ తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డితో పాటు ఇతర పోలీసు అధికారులు, జిల్లాలోని పోలీస్ స్టేషన్లు, సీఐ, డీఎస్పీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న రైటర్లు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ వైపు.. అడుగులు!

❍సంప్రదాయ వరి విడిచి.. ఉద్యాన పంటల బాట ❍అంతర పంటలతో రైతులకు రెట్టింపు ఆదాయం

❍'భూ భారతి' రీ-సర్వే పక్కాగా జరగాలి ❍వరదవెల్లి, రత్నంపేటల్లో కలెక్టర్ గరిమ అగ్రవాల్ పర్యటన



బోయినపల్లి, అక్టోబరు 13 (జనంసాక్షి): వర్షాభావ పరిస్థితులు, తగ్గుతున్న భూగర్భ జలాల నేపథ్యంలో రైతులు సంప్రదాయ వరి సాగును వీడి ప్రత్యామ్నాయ, ఉద్యానవన పంటల వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. బోయినపల్లి మండలం వరదవెల్లి, రత్నంపేట గ్రామాల్లో మంగళవారం కలెక్టర్ పర్యటించి ఆయిల్ పామ్ తోటలు, అంతర పంటలు, భూమి రీ-సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**ఆయిల్ పామ్‌లో 'అంతర' లాభాలు!**

వరదవెల్లికి చెందిన రైతు కదుదుల రాజు-అంజలి దంపతులు తమకున్న 8 ఎకరాల్లో వరిని తగ్గించి, 3.5 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. అందులో అంతర పంటలుగా బెండ, టమాటా, మిర్చి, కాలీఫ్లవర్ తో పాటు పండుగల సీజన్ లక్ష్యంగా బంతి, పట్టుకుచ్చులు (పూల తోటలు), వేరుశెనగ పండిస్తున్నారు.వారి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన కలెక్టర్ పంటల దిగుబడి, ఆదాయ వివరాలను ఆరా తీశారు. వరి వేస్తే ఎకరానికి రూ.50 వేలు వచ్చేదని, ఉద్యాన పంటల ద్వారా ఇప్పుడు ఎకరానికి దాదాపు రూ.లక్ష ఆదాయం వస్తోందని రైతు వివరించడంతో కలెక్టర్ వారిని అభినందించారు. తక్కువ నీటితో, బిందు సేద్యం (డ్రిప్) ద్వారా అధిక లాభాలు గడిస్తున్న రాజు దంపతులు ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు.

**రూ.లక్షల ఆదాయం ఇచ్చే తోటలు**

అనంతరం అదే గ్రామంలో రైతు తరిగొప్పుల మురళికి చెందిన 4.20 ఎకరాల్లో 'వీబీజీ రామ్‌జీ' పథకం ద్వారా కూలీలతో తవ్వించిన గుంతల్లో కలెక్టర్ ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఆయిల్ పామ్ సుదీర్ఘకాలం పాటు స్థిరమైన ఆదాయాన్ని ఇస్తుందని, సిద్దిపేట జిల్లా నర్మెట్ట వద్ద ఫ్యాక్టరీ కూడా అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. రత్నంపేటలో రైతు కొటగాని పద్మ తోటలో నిర్మిస్తున్న 'పామ్ పాండ్' పనులను పరిశీలించారు. 'జలసిరి' కింద భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు, బోర్ వెల్ రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

**రైతుల సమక్షంలోనే 'భూ భారతి' రీ-సర్వే**

వరదవెల్లిలో 'భూ భారతి' పథకంలో భాగంగా రోవర్ యంత్రంతో నిర్వహిస్తున్న భూముల రీ-సర్వే పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. సర్వే విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వే ప్రక్రియను రైతుల సమక్షంలోనే, పూర్తి పారదర్శకతతో చేపట్టి పక్కాగా వివరాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో సర్వేకు ముందే జీపీఓలు, పంచాయతీ కార్యదర్శులు రైతులకు ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ షరీఫ్ మొహిద్దీన్, ఇన్చార్జి ఎంపీడీఓ శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి ప్రణీత తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే

ముస్తాబాద్ అక్టోబర్ 13 (జనం సాక్షి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచే దిశగా మంగళవారం రోజున ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేసుల పురోగతి, పెండింగ్ దర్యాప్తులు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా బాధ్యతగా మెలగాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు.ఆధునిక సాంకేతిక వ్యవస్థపై అధికారులు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టుల వంటి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని,గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో. పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని,డయల్ 112 కు కాల్ రాగానే పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ సిబ్బంది తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ నాగేశ్వరరావు , ఎస్.ఐ జ్యోతి , సిబ్బంది ఉన్నారు.

# బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

❍బతుకమ్మ వేడుకల ఫొటోలు, వీడియోలతో విస్తృత ప్రచారం కల్పించాలి

❍సూపర్ ఎల్‌నినో ప్రభావాలపై బతుకమ్మ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి

❍పర్యాటక అభివృద్ధి పనులను స్థానిక ఇంజినీరింగ్ శాఖలతో త్వరితగతిన పూర్తి చేయాలి

❍రెండు వారాల్లోగా పర్యాటక ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలి

❍హరిత హోటళ్ల పూర్తికి పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలి

❍రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్..



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 జనంసాక్షి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ) వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం హైదరాబాదు నుంచి సంబంధిత అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బతుకమ్మ వేడుకల నిర్వహణతో పాటు పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, నిధుల సమీకరణ, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. బతుకమ్మ వేడుకలు గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. వేడుకలు జరిగే ప్రదేశాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను విస్తృతంగా సేకరించి, ప్రచారం చేయాలని కలెక్టర్లకు సూచించారు. బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రజలకు చేరువయ్యే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

వార్తా లోపలి పేజీలో

# బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

ప్రస్తుత సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పర్యావరణంపై ప్రభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బతుకమ్మ పాటల పోటీలను నిర్వహించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలు పాటల్లో ప్రతిబింబించేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణమైన సందేశాలతో పాటలు రూపొందించేలా ప్రజలను, మహిళా సంఘాలను, యువతను ప్రోత్సహించాలని తెలిపారు. బతుకమ్మ వేడుకలను సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించే వేదికగా కూడా వినియోగించుకోవాలని సూచించారు.

**పర్యాటక అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి**

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను జిల్లాలకు బదిలీ చేసినట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్ తెలిపారు. ఈ ప్రాజెక్టులను సంబంధిత స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో చేపట్టి, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలకు బదిలీ చేసిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల వివరాలను పరిశీలించి, వాటి పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్థానిక ఇంజినీరింగ్ శాఖలకు పనుల బాధ్యతలు అప్పగించి, పనుల అమలు, నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను పర్యాటక కార్పొరేషన్‌కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) సిద్ధం చేసేందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. అవసరమైన చోట కన్సల్టెన్సీ సహకారం కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి జిల్లాలో సంబంధిత ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా ఇంజినీరింగ్ శాఖలకు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు. ప్రాజెక్టు పరిధి, భూమి లభ్యత, నిర్మాణ పనులు, అవసరమైన మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, నిధుల సమీకరణ, అమలు గడువు వంటి అంశాలను డీపీఆర్‌లో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు.

కొన్ని జిల్లాల్లో హరిత హోటళ్ల నిర్మాణ పనులు పాక్షికంగా పూర్తయిన నేపథ్యంలో, మిగిలిన పనులను పూర్తి చేసి వాటిని నిర్వహణలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పెట్టుబడిదారుల సహకారంతో నిర్మాణ పనులను పూర్తి చేసి, నిర్దిష్ట కాలం పాటు నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. జిల్లాలో ఇటువంటి ప్రాజెక్టులకు ఆసక్తి చూపే ప్రైవేట్ పెట్టుబడిదారులు ఉంటే జిల్లా స్థాయిలో వారిని గుర్తించి ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు. ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి, సమగ్ర ప్రణాళికతో పాటు ఆకర్షణీయమైన ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి అందాలు, వారసత్వ ప్రదేశాలను గుర్తించి, వాటి అభివృద్ధికి అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, అమలు విధానం, పర్యాటకుల సౌకర్యాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు.

పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం, ప్రైవేట్ పెట్టుబడులు వంటి అన్ని అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. ముఖ్యంగా స్వదేశ్ దర్శన్ పర్యాటక అభివృద్ధి కార్యక్రమం కింద జిల్లాలకు అనువైన ప్రాజెక్టులను గుర్తించి, నిధులు సమకూర్చుకునేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్, వసతి, సమాచార బోర్డులు, భద్రత వంటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, స్థానిక ఆహార సంస్కృతిని పర్యాటకంతో అనుసంధానం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించాలన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు సురక్షిత వాతావరణం కల్పించడంతో పాటు, సంబంధిత శాఖల సమన్వయంతో పర్యాటక సౌకర్యాలను మెరుగుపరచాలని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా రెవెన్యూ అధికారి గీత, జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి పవన్ కుమార్ పాల్గొన్నారు.



## అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారం

**రాయికల్ అక్టోబర్13 జనంసాక్షి :** రాయికల్ మండలంలోని అల్లిపూర్ గ్రామంలో నవదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతు న్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన మంగళవారం నాడు అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ?ఈ సందర్భంగా తెల్లవారుజామున 7 గంటల నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభాత సేవ, జపాలు, చండీ పారాయణం, మహానివేదన మరియు మహామంగళహారతి శాస్త్రోక్తంగా అర్చకులు అంగడి పరమేశ్వర్ నిర్వహించారు. మండపంలో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవదుర్గ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## దుర్గామాతను దర్శించుకున్న మాజీ ఎంపీటీసీ సభ్యులు బోనాల వెంకటస్వామి



**కమాన్ పూర్, అక్టోబర్ 13, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను మంగళవారం కమాన్ పూర్ -2 మాజీ ఎంపీటీసీ సభ్యులు, సుందరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు బోనాల వెంకట స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తున్న చెట్లను పెంచాలి..

### రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి..

**గోదావరిఖని, జనంసాక్షి :** ప్రాణ వాయువైన ఆక్సిజన్ అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తున్న చెట్లను విరివిగా పెంచాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. మంగళ వారం 47 వ డివిజన్ కృష్ణాలయం వీధిలో ప్రతిష్టించిన దుర్గా దేవి మండపం వద్ద పూజలు చేసిన అనంతరం స్థానిక కార్పొరేటర్ దాసరి సాంబమూర్తి ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత మొక్కల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండంలో పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యం కారణంగా అనేక వ్యాధులు సంభవిస్తున్నందున వాటిని నివారించడానికి ప్రతి ఇంట్లో , వీధిలో మొక్కలు విరివిగా నాటవలసిన ఆవశ్యకత మరింత ఎక్కువగా ఉందని అన్నారు. వన మహోత్సవంలో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా పండ్ల , పూల మొక్కలు పంపిణీ చేయడం జరుగుతున్నదని అన్నారు. అన్ని డివిజన్ల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉచితంగా మొక్కలు తీసుకెళ్ళి వాటిని నాటి , పరిరక్షించి హరిత రామగుండం గా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వద్దూరి రవి , నగర పాలక సంస్థ ఎ ఇ తేజస్విని , టి పి ఓ నవీన్ , మెప్మా సి ఓ శ్వేత , నాయకులు కల్వల రంజిత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం దుర్గా దేవి నవరాత్రుల్లో భాగంగా శివాజీ నగర్ పోచమ్మ గుడి నుండి ప్రధాన చౌరస్తా వరకు నిర్వహించిన ఊరేగింపులో దుర్గా మాత భవానీ లతో కలిసి కోలాటం ఆడుతూ నృత్యం చేశారు. అమ్మ వారికి మొక్కులు సమర్పించారు.



# జుక్కల్‌లో అంబరాన్నంటిన ఎల్‌కేఆర్ బతుకమ్మ సంబరాలు

### ఆడపడుచుల ఆటపాటలతో మార్మోగిన వేడుకలు..
### మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన ఎమ్మెల్యే సతీమణి తోట అర్చన

**నిజాంసాగర్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని జుక్కల్ మండల కేంద్రం లోని గుండూరు రోడ్డులో మంగళవారం ఎల్‌కేఆర్ బతుకమ్మ సంబరాలు? 2026 ఘనంగా నిర్వహించారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

**పూల బతుకమ్మలతో కళకళలాడిన ప్రాంగణం**

రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో వేడుకల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. సంప్రదాయ వస్త్రధారణలో వచ్చిన మహిళలు బతుకమ్మల చుట్టూ వలయాకారంగా చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ, కోలాటాలు, నృత్యాలతో సందడి చేశారు. మహిళల ఆటపాటలతో జుక్కల్ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది.

**మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన తోట అర్చన**

ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సతీమణి తోట అర్చన ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జుక్కల్ నియోజకవర్గ మహిళలతో ఆత్మీయంగా మమేకమైన ఆమె, వారితో కలిసి బతుకమ్మను పేర్చి, బతుకమ్మ



పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. మహిళలతో కలిసిమెలిసి వేడుకల్లో పాల్గొనడంతో కార్యక్రమ ప్రాంగణంలో మరింత సందడి నెలకొంది.

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం**

బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. ఇలాంటి సంప్రదాయ పండుగలను ఘనంగా నిర్వహించడం ద్వారా భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయవచ్చనే సందేశాన్ని ఈ వేడుకలు చాటిచెప్పాయి. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాల్లో మహిళల పెద్దఎత్తున భాగస్వామ్యం కనిపించింది. బతుకమ్మ పాటలు, పూల పరిమళాలు, ఆడపడుచుల ఆనందోత్సాహాల మధ్య వేడుకలు పండుగ శోభను సంతరించుకున్నాయి.జుక్కల్ గడ్డపై తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటుతూ నిర్వహించిన ఎల్‌కేఆర్ బతుకమ్మ సంబరాలు?2026 స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



# వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

- స్వేచ్ఛా రథాన్ని జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- కలెక్టరేట్ ప్రాంగణంలో వెట్టిచాకిరీ నిర్మూలన అవగాహన పోస్టర్ ఆవిష్కరణ




**పెద్దపల్లి,అక్టోబర్ 13(జనంసాక్షి) :** వెట్టిచాకిరీ నిర్మూలన, నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో వెట్టిచాకిరీ నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన స్వేచ్ఛా రథాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వెట్టిచాకిరీ నిర్మూలనకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, వెట్టిచాకిరీ నిర్మూలన, నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, బాధితులకు సకాలంలో ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వెట్టిచాకిరీకి సంబంధించిన ఘటనలు ఎక్కడైనా గుర్తించినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.-వెట్టిచాకిరీ ఘటనల సమాచారం కోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ : వెట్టిచాకిరీకి సంబంధించిన ఘటనలను తెలియజేయడానికి, బాధితులకు సకాలంలో ప్రభుత్వ సహాయం అందేలా జోక్యం కోరడానికి టోల్‌ఫ్రీ బాండెడ్ లేబర్ హెల్ప్‌లైన్ 080-69434343 అందుబాటులో ఉందని తెలిపారు. వెట్టిచాకిరీ బాధితులు, ఈ తరహా ఘటనల గురించి తెలిసిన వారు హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని సూచించారు. స్వేచ్ఛా రథం ద్వారా ప్రజలకు వెట్టిచాకిరీ వల్ల కలిగే అనర్థాలు, దాని నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములై వెట్టిచాకిరీ నిర్మూలనకు సహకరించాలని కోరారు.- వెట్టిచాకిరీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి : ప్రతి ఒక్కరూ గౌరవప్రదంగా,స్వేచ్ఛగా,ఎలాంటి దోపిడీకి గురికాకుండా పనిచేసే పరిస్థితులు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వెట్టిచాకిరీని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వ శాఖలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని, బాధితులకు అండగా నిలుస్తూ వెట్టిచాకిరీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

### - దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్



**పెద్దపల్లి,అక్టోబర్ 13(జనంసాక్షి) :** గోదావరి పుష్కరాలు-2027ను ప్రశాంతంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ సంబంధిత జిల్లా కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు.సోమవారం దేవాదాయ కమిషనర్ హనుమంతరావుతో కలిసి సంబంధిత జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.పెద్దపల్లి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల పనుల అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.పుష్కరాలు ప్రారంభమయ్యే సమయానికి ఎలాంటి పనులు పెండింగ్‌లో ఉండకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని, ప్రతి పనికి స్పష్టమైన లక్ష్యాలు,గడువులు నిర్దేశించుకుని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.భూసేకరణకు సంబంధించిన సమస్యలను జిల్లా స్థాయిలో గుర్తించి, పరిష్కారం కోసం ప్రభుత్వానికి పంపాల్సిన ప్రతిపాదనలను ఆలస్యం చేయకుండా పంపించాలని తెలిపారు. వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచి, అనుమతుల ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు.కొత్త పుష్కర ఘాట్ల నిర్మాణానికి ప్రజాప్రతినిధుల నుంచి అందిన ప్రతిపాదనలను పరిశీలించేటప్పుడు భక్తుల అంచనా సంఖ్య, ఇప్పటికే అందుబాటులో ఉన్న ఘాట్ల సామర్థ్యం, నదిలో నీటి ప్రవాహం, భద్రత, రహదారి సౌకర్యాలు, రాకపోకల నిర్వహణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ సూచించారు.దేవాదాయ, నీటిపారుదల, రహదారులు-భవనాలు,పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల టెండర్ల స్థితిగతులను సమీక్షిస్తూ,టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశించారు.టెండర్ల పరిశీలన, ఎల్-1 ఖరారు, లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ జారీ, ఒప్పందాల ప్రక్రియల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.పుష్కరాల సమయంలో భారీగా తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా రహదారులు,రాకపోకల నిర్వహణ, పారిశుధ్యం, తాగునీరు, ఇతర ప్రాథమిక సౌకర్యాల కల్పనకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశించారు.నదీ తీర ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, భక్తుల రద్దీ నియంత్రణకు సంబంధిత శాఖలు సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలని సూచించారు.ప్రతి జిల్లా కలెక్టర్ తమ పరిధిలోని పుష్కర ప్రాంతాల వారీగా పనుల పురోగతిని సమీక్షిస్తూ, ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పుష్కరాలు ప్రారంభమయ్యేలోగా అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ కొత్త పుష్కర ఘాట్ల నిర్మాణాన్ని భక్తులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా పక్కా ప్రణాళికతో చేపట్టాలని దేవాదాయ కమిషనర్ హనుమంతరావు అధికారులకు సూచించారు.ఘాట్ల నిర్మాణానికి ముందు భక్తుల రద్దీ, అందుబాటులో ఉన్న స్థలం, రాకపోకల సౌకర్యాలు, భద్రత, మురుగునీటి సమస్యలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని తెలిపారు.భక్తులందరూ ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా వివిధ ఘాట్లకు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని, ఏ ఒక్కచోటా అధిక రద్దీ ఏర్పడి తొక్కిసలాటకు దారితీయకుండా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు-2027 నేపథ్యంలో పెద్దపల్లి జిల్లాలో గోదావరి తీర ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి తెలిపారు.పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, అవసరమైన పనులను గుర్తిస్తామని తెలిపారు.పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి భూసేకరణ, ప్రభుత్వ అనుమతులు, టెండర్ల ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, జాప్యం లేకుండా పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశిస్తామని పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నవీపేట్-బాసర రైల్వే మార్గంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

- రైలు కిందపడి మృతిచెంది ఉంటాడని అనుమానం
- మృతుడి ఆచూకీ కోసం రైల్వే పోలీసుల దర్యాప్తు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 జనం సాక్షి :** నవీపేట్-బాసర రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. రైల్వే ట్రాక్‌పై సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల ఓ వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని గుర్తించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈ ఘటన అక్టోబర్ 12వ తేదీ రాత్రి 9.16 గంటలకు ముందుగా జరిగినట్లు వెల్లడించారు.నవీపేట్?బాసర రైల్వే స్టేషన్ల మధ్య కిలోమీటర్ నంబర్ 443/29?31 వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. గుర్తుతెలియని రైలు కిందపడి ఆ వ్యక్తి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, మృతుడి వివరాలు తెలియజేసే ఎలాంటి ఆధారాలు ఇప్పటివరకు లభించలేదు.ఈ ఘటనపై నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 192/2026, సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేశారు. మృతుడి గుర్తింపును నిర్ధారించేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుడిని ఎవరైనా గుర్తించినా, ఆయనకు సంబంధించిన వివరాలు తెలిసినా, కుటుంబ సభ్యులు లేదా బంధువులు ఎవరైనా సమాచారం అందించాలనుకున్నా నిజామాబాద్ రైల్వే పోలీసులను సంప్రదించాలని అధికారులు కోరారు. సమాచారం కోసం సంప్రదించాల్సిన నంబర్. 8712658591.

## చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

### - గ్రామ సర్పంచ్ గోగు రాజయ్య యాదవ్



**పెద్దపల్లి (రూరల్), అక్టోబర్ 13 ( జనంసాక్షి) :** ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆటల్లో ,క్రీడల్లో రాణించాలని తుర్కల మద్దికుంట గ్రామ సర్పంచ్ గోగు రాజయ్య అన్నారు.మంగళవారం తురకల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో పిల్లలకు దసరా సెలవుల సందర్భంగా ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఒకటి నుండి 8వ తరగతి చదువుతున్న పిల్లలందరికీ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఆటల పోటీలు నిర్వహించారు. అలాగే తల్లులతో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గోగు రాజయ్య హాజరై గెలిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.గ్రామ సర్పంచ్ రాజయ్య మాట్లాడుతూ దసరా సెలవులలో పిల్లలకి వినోద కార్యక్రమాలు,తల్లులను కూడా సపోర్ట్ చేస్తూ వారికి బతుకమ్మ సంబరాలు జరిపించడం చాలా బాగుందనీ హర్షం వ్యక్తం చేశారు.ప్రథమ్ సంస్థ ఆధ్వర్యంలో చాలా మంచి మంచి కార్యక్రమాలు చేస్తూ గ్రామంలో ఉన్న పిల్లలను వారి తల్లిదండ్రులను చేస్తూ ఇలాంటి ప్రోగ్రామ్స్ చేయడం చాలా బాగుందన్నారు.రానున్న రోజుల్లో ప్రోగ్రామ్స్ మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తిరుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజులత,మండల కో ఆర్డినేటర్ కీర్తన,విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో

## ఘనంగా బతుకమ్మ వేడుకలు

### - వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సిహెచ్ విజయ రమణారావు సతీమణి- పావని



**పెద్దపల్లి,అక్టోబర్ 13 (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ పై మంగళవారం రాత్రి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ పి హెచ్ సీ ల నుండి తీరొక్క పూలతో బతుకమ్మను అలంకరించి ట్యాంక్ బండ్ వద్దకు తీసుకువచ్చి బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ సిహెచ్ విజయ రమణారావు సతీమణి పావని, కూతురు వైష్ణవి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పవిత్ర, మరియు వైద్య అధికారులతో, సిబ్బంది తో ఆటపాటలతో బతుకమ్మ ఆడి సంబరాలు చేసుకున్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి గౌరమ్మ ను పూజించి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మెడికల్ ఆఫీసర్లు, డిప్యూటీ డిఎంహెచ్వోలు,వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు. మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య,కార్పొరేటర్లు భూత గద్ద సంపత్,అశ్రఫ్ షరీఫ్, పలు వార్డు కౌన్సిలర్ లు,కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

- ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్ లేకుండా పరిష్కరించాలి
- బయోమెట్రిక్ హాజరు, ఈ-ఆఫీస్ అమలుపై ప్రత్యేక దృష్టి
- అధికారులకు కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశాలు



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి):** కరీంనగర్ నగరపాలక సంస్థలో పాలనను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ తదితర విభాగాల అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థ ఆస్తుల వివరాలు, వాటి పరిరక్షణ, సీఎం ప్రజావాణి, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, బయోమెట్రిక్ హాజరు, ఈ-ఆఫీస్ వినియోగం తదితర అంశాలపై సమీక్షించారు. విభాగాల వారీగా పెండింగ్ పనుల పురోగతి, కార్యాలయంలో వసతులు, ఫర్నిచర్ వివరాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ××ఆస్తుల వివరాలు ఫోటోలతో నమోదు చేయాలి××నగరపాలక సంస్థకు చెందిన ఓపెన్ స్థలాలు, భవనాలు, పార్కులు, రిజర్వాయర్లు, ఫిల్టర్ బెడ్లు, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు, ఎస్టీపీలు, ఎఫ్ఎస్టీపీ, ఏబీసీ సెంటర్, మార్కెట్లు, స్లాటర్ హౌస్‌లు, పట్టణ ప్రకృతి వనాలు, నర్సరీలు, డంపింగ్ యార్డులు, పారిశుధ్య వాహనాలు, వార్డు కార్యాలయాలు, బస్తీ దవాఖానాలు, షట్టర్లు, నైట్ ఫుడ్ కోర్టు, డీఆర్‌సీసీ, రైతు బజార్లు, కమ్యూనిటీ భవనాలు, ఓహెచ్ఎస్ఆర్ పంపుసెట్లు, లైబ్రరీలు, రీడింగ్ రూములతో పాటు ఇతర ఆస్తుల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని కమిషనర్ ఆదేశించారు. ప్రతి ఆస్తి ప్రస్తుత స్థితిని ఫోటోలతో సహా అందించాలని సూచించారు. ప్రహరీ గోడలు లేని ఆస్తులకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి, వాటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు**

సీఎం ప్రజావాణి, ప్రజావాణి ద్వారా అందిన వినతులను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులందరికీ బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, సమయపాలన పాటించేలా చూడాలని సూచించారు. ఈ-ఆఫీస్ ద్వారా పారదర్శక పాలన××పాలనలో పారదర్శకతను పెంచడంతో పాటు ఫైళ్ల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు ఈ-ఆఫీస్ విధానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాలని ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. ఫైళ్ల కదలికతో పాటు కార్యాలయ కార్యకలాపాలు డిజిటల్ విధానంలోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆయాజ్, డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొహియుద్దీన్, వేణుమాధవ్, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్, ఈఈ లచ్చిరెడ్డి, డీఈలు దేవేందర్, ఓం ప్రకాశ్, వెంకటేశ్వర్లు, డీసీపీ బషీరొద్దీన్, ఏసీపీలు వేణు, శ్రీధర్, ఏఈలు, టీపీఎస్‌లు, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలి

- సర్ కార్యక్రమాన్ని తక్షణమే రద్దు చేయాలి
- తెలంగాణ స్టేట్ డెమోక్రటిక్ ఫోరం కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక రెడ్డి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 జనంసాక్షి:** నిజామాబాద్ నగరంలో తెలంగాణ స్టేట్ డెమొక్రటిక్ ఫోరం ( టిఎస్‌డిఎఫ్ ) ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ .వినాయక రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సావీకి పేరుతో 14 కోట్ల పైగా ఓటర్లను తొలగించారని, దేశంలో రాజ్యాంగబద్ధమైన వ్యవస్థల పనితీరు మన ప్రజాస్వామ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభ తీవ్రతను ఇది తెలియజేస్తుందని, ప్రజాస్వామ్యం ఎన్నికలతో మాత్రమే కాదు ఎన్నికల విశ్వసనీయతతో కూడుకొని ఉన్నది, దానిని నేడు బిజెపి జేబు సంస్థగా మార్చుకున్నది , నేడు ఎలక్షన్ కమిషన్ బీజేపీ కి అనుకూలంగా షెడ్యూల్స్ ను అనుకూలమైన ఓటర్ల జాబితా తయారు చేసే సంస్థగా వ్యవహరిస్తున్నది, జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, సార్ ప్రక్రియ ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

**రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్** మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును నేడు కేంద్ర ప్రభుత్వం తొలగింపు చర్యలు భాగంగా వివిధ రాష్ట్రాల్లో దాదాపు 14 కోట్ల ఓటర్లను తొలగించారని, జ్ఞానేష్ కుమార్ పూర్తిగా బీజేపీ ఏజెంట్ మారి దేశంలో ఉన్న మైనార్టీ ముస్లిం క్రిస్టియన్ ఆదివాసుల ఓట్లను తొలగిస్తున్నారని, భారత రాజ్యాంగం ప్రకారం 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాలని, ఎస్ ఐ ఆర్ ద్వారా దేశంలో ఓటు హక్కు ఉన్న పౌరులు లేని పౌరులుగా విభజన చేసే కుట్ర జరుగుతుందని అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రో. విద్యాసాగర్, నూడ



చైర్మన్ కేశ వేణు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ ,సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, టిపిటిఎఫ్ నాయకులు వేణుగోపాల్, కొండల్ రెడ్డి ,వివిధ ప్రజా సంఘాల నాయకులు తాం చంద్, వాసు, రామ్మోహన్ రావు, రవీంద్ర నాథ్ సూరి, వరదయ్య, గౌతం కుమార్, జన్నారపు రాజేశ్వర్,వనమాల సత్యం , వి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఐదు నెలలుగా వేతనాలేవి?

# కల్లు డిపో కార్మికుల ఆందోళన

**యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపణ..**

**బకాయిలు చెల్లించే వరకు డిపో కార్యకలాపాలు నిలిపివేయాలని డిమాండ్..**

**ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 జనం సాక్షి:** ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం, బకాయిల కోసం ప్రశ్నిస్తే యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపిస్తూ నిజామాబాద్‌లోని కల్లు డిపో కార్మికులు ఆందోళనకు సిద్ధమయ్యారు. న్యామకల్ రోడ్డులో ఉన్న భవానీ గీతా పారిశ్రామిక సహకార సంఘం (కల్లు డిపో-3)లో పనిచేస్తున్న కార్మికులు తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బకాయి వేతనాలు పూర్తిగా చెల్లించే వరకు డిపోలో కల్లు కలపడం, విక్రయించడం, రవాణా చేయడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

**...వేతనాలు లేక కుటుంబ పోషణ భారంగా మారింది**

ఈ డిపోపై సుమారు 40 మంది గీతా కార్మికులు, మరో 250 మంది గౌడ కుల సభ్యులు ఆధారపడి జీవిస్తున్నారని బాధితులు తెలిపారు. వీరితోపాటు పరోక్షంగా మరికొందరి జీవనోపాధి కూడా డిపోపై ఆధారపడి ఉందన్నారు. అయితే, గత ఐదు నెలలుగా తమకు రావాల్సిన వేతనాలు చెల్లించడం లేదని, గౌడ కుల సభ్యులకు సైతం గత 12 నెలలుగా చెల్లింపులు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల కోసం ఎన్నిసార్లు అడిగినా రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. చేతికి డబ్బులు అందక కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని వాపోయారు.

**...ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపణ.**

గత ఐదేళ్లుగా డిపో నిర్వహణ బాధ్యతల్లో ఉన్న సేపూర్ జయసింహ గౌడ్, సేపూర్ స్వామి గౌడ్, సేపూర్ సుమన్ గౌడ్, బుర్ర శ్యామ్‌సుందర్ గౌడ్‌ల వ్యవహారశైలిపై కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. డిపోలో ప్రతిరోజూ కల్లు విక్రయాలు జరుగుతున్నప్పటికీ తమకు మాత్రం వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. నిర్వహణ బాధ్యతల్లో ఉన్నవారు వేతనాలు, ఇతర ఖర్చుల రూపంలో నెలకు ఒక్కొక్కరు సుమారు రూ. 2 లక్షల వరకు తీసుకుంటున్నారని, కార్మికులకు మాత్రం బకాయిలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. తమకు రావాల్సిన డబ్బుల గురించి నిలదీస్తే సమస్యలను పరిష్కరించకుండా బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు.

**...బకాయిలు చెల్లించేవరకు డిపో నిలిపివేయాలి.**

తమకు న్యాయం జరిగేలా ఎక్సైజ్ అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని కార్మికులు వినతిపత్రంలో కోరారు. ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను పూర్తిగా చెల్లించే వరకు డిపోలో కల్లు కలపడం, విక్రయించడం, రవాణా చేయడం నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యను పరిష్కరించి, వారి కుటుంబాలు ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. ఈ ఫిర్యాదు ప్రతులను నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓకు సైతం అందించినట్లు తెలిపారు.

**...స్పందించకుంటే కుటుంబాలతో కలిసి ధర్నా**

అధికారులు తమ సమస్యపై స్పందించకపోతే కుటుంబ సభ్యులతో కలిసి ఎక్సైజ్ కార్యాలయం ఎదుట శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తామని కార్మికులు హెచ్చరించారు. అక్కడే వంటా-వార్పు కార్యక్రమం చేపట్టి తమ నిరసనను తెలియజేస్తామని స్పష్టం చేశారు. కష్టపడి పనిచేసే గీతా కార్మికులకు సకాలంలో వేతనాలు అందేలా, పెండింగ్ బకాయిలు చెల్లించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

# విలీన గ్రామాలపై పట్టింపేది?

- గుంతలు పడ్డ రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

**వేములవాడ, అక్టోబర్ 13 (జనంసాక్షి):** గుంతలు పడ్డ రోడ్డు, ఇరువైపులా ముళ్లపొదలతో నిండిపోయిన రహదారి పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు. వేములవాడ మున్సిపాలిటీలో విలీనమైన 3 వ వార్డు అయ్యోరుపల్లి గ్రామ పరిస్థితి. గ్రామం నుండి రైతులు నిత్యం పాలు, కూరగాయలతో వేములవాడ పట్టణానికి తీసుకెళ్తుంటారు. రహదారి గుంతలు పడి పూర్తిగా చెడిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.విలీన గ్రామంలో వీధిలైట్లు పెట్టడం, 15 రోజులకొకసారి మురుగు కాలువలు శుభ్రం చేయడం తప్ప ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నారు, వేములవాడ నుండి అయ్యోరుపల్లి వరకు కోటి రూపాయలతో రోడ్డు మంజూరైనప్పటికీ పనులు మొదలు కాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారి గుండా బోయినిపల్లి మండలంలో ని రామన్నపేట, రత్నంపేట, దేశయిపల్లి, జగ్గారావుపల్లి గ్రామాల వారు కూడా రాకపోకలు సాగిస్తుంటారని రాత్రి వేళలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకునే వారు లేరని వారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించి గుంతలు పడ్డ రోడ్డును సదను చేయాలని మున్సిపల్ లో విలీన గ్రామమైన అయ్యోరుపల్లి గ్రామస్తులు కోరారు.





## న్యాయవాదులకు ఉచిత వైద్య శిబిరం

కరీంనగర్ లీగల్, అక్టోబర్ 13, (జనంసాక్షి)
కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫార్చ్యూన్ మెడికేర్ ఆసుపత్రి సౌజన్యంతో మంగళవారం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా జడ్జి ఎస్. శివకుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ హెల్త్ చెకప్, ఈసీజీ, 2డీ ఎకో, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయుల పరీక్షలు తదితర వైద్య సేవలు అందించారు. న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రపాటి కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు బండ శివకుమార్, బొడ్ల గీతారాణి, కార్యదర్శి సుంకె దేవకిషన్, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శి బెజ్జంకి శ్రీకాంత్, కోశాధికారి బొజ్జ స్వామి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు ముప్పిడి మదన్ బాబు, సంధ్యారాణి, మాజీ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, చిట్టంపెల్లి కిరణ్ కుమార్, ముని వేణుగోపాల్, గంట సతీష్, బండ రాజశ్రీ, ఏ. కిరణ్ కుమార్‌తో పాటు పలువురు న్యాయవాదులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏడి ఏఈ కి కలిగోట గ్రామ రైతులు కరెంటు కోతల సమస్యపై వినతి పత్రం



కథలాపూర్ అక్టోబర్ 13 (జనం సాక్షి) కథలాపూర్ మండలంలోని కలిగోట గ్రామానికి చెందిన రైతులు కరెంటు కోతలు సమస్యలతో అంబరిపేట సబ్ స్టేషన్ వద్ద కలికోట రైతులనిరసన వినతిపత్రం సమర్పించిన రైతులు గత నెల రోజులుగా సమస్య వేధిస్తున్నాడంతో పంటలు ఎండిపోయి మోటర్ కాలిపోవడం కూడా జరుగుతున్నది కావున రైతులు కరెంటు త్రీ పేజ్ 12:00 నిరంతరంగా ఇవ్వాలని కోరినారు పైనుండి మెసేజ్లు ఆంక్షలు వచ్చాయని షరతులు లేకుండా పూర్తి కరెంటు ఇవ్వగలరని కోరినారు నిరసనలు చేస్తామని తెలియజేశారు. ఏఈ బండారి అశోక్ ఈరోజునుండి 11గంటలు నిరంతరంగా ఇస్తామని హామీ ఇచ్చినారు. ఇలాగే 3పేస్ అంతరాయం ఎదురైతే తీవ్రానిరసనలు ఎదురై తాయని రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గంగారెడ్డి రవీందర్ రెడ్డి, దేవరాజు, మల్లేశం, తిరుపతి, రాజశేఖర్ అరవింద్ హరీష్ కలిగోట గ్రామ రైతులు పాల్గొన్నారు.



## పద్మశాలి ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పరామర్శ

మంథని, అక్టోబర్ 13, (జనంసాక్షి) : తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల కోటేశం తండ్రి రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి పరికిపండ్ల రాజలింగం వృద్ధాప్యంతో ఇటీవలే మరణించారు. వారి పదవరోజు కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంథని ముత్తారం గ్రామంలోని వారి స్వగృహానికి సంఘ నాయకులు తరలివచ్చారు. తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు హాజరై, రాజలింగం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పరికిపండ్ల కోటేశం, వారి సోదరులు సత్య నారాయణ, శ్రీనివాస్, ఇతర కుటుంబ సభ్యులను పరా మర్శించి ఓదార్చారు. రాజలింగం పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని రాష్ట్ర అధ్యక్షులు ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి శ్రీనివాస్, వరంగల్ జిల్లా కోశాధికారి బూర తిరుపతయ్య, ప్రచార కార్యదర్శి కోడూరి రమేష్ , కార్యనిర్వాహక కార్యదర్శి రాజమౌళి పాల్గొన్నారు. వీరితో పాటు ముత్తారం పద్మశాలి సంఘం స్థానిక నాయకులు పరికిపండ్ల రమేష్, బూర సుగుణ, పెండం గణేష్, కుడికాల కుమార్, పరికిపండ్ల మొగిలితదితరులు పాల్గొనిమృతునికి నివాళులు అర్పించారు.



## 11వ డివిజన్ కట్టరాపూర్‌లో దుర్గామాతను దర్శించుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న పటేల్

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి) :
నగరంలోని 11వ డివిజన్ కట్టరాపూర్ లో శ్రీ నవదుర్గ యూత్ సభ్యుల ఆహ్వానం మేరకు కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న పటేల్ దుర్గామాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యా లతో ఉండాలని ప్రార్థించారు. దసరా పండుగ సందర్భం గా అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజల జీవితాల్లో సుఖశాంతులు, సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీ నవదుర్గ యూత్ సభ్యులు నిర్వహించిన ఏర్పాట్లను అభినందిస్తూ, భక్తులకు దుర్గామాత ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ నవదుర్గ యూత్ సభ్యులు, స్థానిక యువకులు, భక్తులు, కట్టరాపూర్ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

## కట్లపాము కాటుకు గురైన బాలుడికి జిజిహెచ్ లో అరుదైన చికిత్స



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13
జనం సాక్షి: కట్లపాము కాటుకు గురైన తొమ్మిదే ళ్ల బాలుడికి ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన చికిత్స నిర్వహించారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరిం టెండెంట్ ఎల్ రాములు మంగళవారం వివరాలు వెల్లడించారు. అక్టోబర్ 6వ తేదీన తెల్లవారుజామున బాలుడు ఇంట్లో కట్లపాము కాటుకు గురయ్యాడు. దీంతో నరాల బలహీనత (న్యూరోటాక్సిసిటీ), కనురెప్పలు వాలిపోయే (ప్టోసిస్) లక్షణాలతో జీజీహెచ్లో చేరాడు. ఆస్పత్రిలో చేరిన కొద్దిసేపటికే శ్వాస తీసుకోవడం కష్టంగా మారడంతో, పరిస్థితి విషమించకుండా వైద్య బృందం తక్షణమే స్పందించింది. చిన్నారికి అత్యవసరంగా 20 యాంటీ స్నేక్ వెనమ్ డోసులతో పాటు అట్రోపిన్, నియోస్టిగ్మైన్ మందులను అందించారు. శ్వాసక్రియను మెరుగుపర్చేందుకు వెంటనే మెకానికల్ వెంటిలేషన్‌పై ఉంచి వైద్యులు నిరంతరం పర్యవేక్షించారు. అన్ని రకాల సంప్రదాయ, సమగ్ర వైద్య విధానాలను అందించడంతో, చికిత్సకు చిన్నారి శరీరం సానుకూలంగా స్పందించింది. ఆస్పత్రిలో చేరిన మూడో రోజున చిన్నారికి స్పృహ రాగా, నాలుగో రోజున వెంటిలేటర్ సపోర్టును విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం చిన్నారి నరాల సంబంధిత సమస్యల నుంచి పూర్తిగా కోలుకున్నారని, పల్స్, బీపీ వంటి కీలక సంకేతాలు (వైటల్స్) స్థిరంగా ఉన్నాయని వైద్యులు వెల్లడించారు. సమయానికి తగిన వైద్యం అందించడం వల్లే చిన్నారి కోలుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఆస్పత్రి వైద్యులు పీడియాట్రిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్లు శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కీర్తిని జీజీహెచ్ సూపరింటెండెంట్ రాములు అభినందించారు.

# కమాన్ పూర్ లో షీ టీమ్ అవగాహన సదస్సు



కమాన్ పూర్, అక్టోబర్ 13, (జనంసాక్షి) :
రామగుండం సీపీ ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇంచార్జి ఎస్సై ఎం. లావణ్య ఆధ్వర్యంలో కమాన్ పూర్ గ్రామంలో ఆదివారపు మండల సమాఖ్య మహిళా గ్రూపు సభ్యులకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ.. విద్యార్థులు తెలియని వారి పట్ల ఎలా ఉండాలి, పోక్సో చట్టం గురించి, సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది, విద్యార్థుల ప్రవర్తన నియమావళి గురించి వివరించారు. టీనేజ్ ఏజ్ లో జరిగే మార్పులు, మహిళల భద్రత, ఆన్ లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్ గురించి తెలిపారు. మహిళల రక్షణ కోసం ప్రతిరోజూ బస్టాండ్, ప్రధాన చౌరస్తాలు, జన సమీకరణ ప్రాంతాలు, కళాశాలల వద్ద షీ టీమ్ నిఘా ఉంటుందని, ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు, విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 / 112 నంబర్ కు డయల్ చేయాలని, ఆన్ లైన్ మోసాలకు గురైతే 1930 కి ఫోన్ చేయాలని, మహిళలు ప్రయాణ సమయంలో ట్రావెలింగ్ సేఫ్టీ యాప్ టి సేఫ్ యాప్ వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పద్మ, సీసీ లు బిక్షపతి, మల్లయ్య, షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం.. భక్తులకు అన్నదానం:

..విశ్వపాలిని సేవా సమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు..



రాయికల్, అక్టోబర్ 13 జనంసాక్షి:
రాయికల్ పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో విశ్వపాలిని సేవా సమితి స్థానిక మార్కండేయ దేవాలయంలో రుద్రాభిషేకం, అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించింది. ఉదయం నుంచి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, భక్తుల శివనామస్మరణ మధ్య రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వపాలిని సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ.. భగవంతుని కృపతో ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. భక్తులకు ఆధ్యాత్మిక సేవలు అందించడంతో పాటు సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రుద్రాభిషేకం ద్వారా సమాజంలో శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, మున్సిపల్ చైర్మన్ రవి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావుతో పాటు విశ్వపాలిని సేవా సమితి సభ్యులు, స్థానిక ప్రముఖులు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** నగరపాలక సంస్థ పరిదిలోని ముకరాంపుర మురుగు నీటి కాలువ పనులు చేపట్టి ఈ ప్రాంత వరద ముంపును శాశ్వతంగా తొలగిస్తామని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ నగర అభివృద్ధి లో భాగంగా మంగళవారం 64వ డివిజన్ లో పర్యటించారు. ముకరాంపుర జఫ్రీ మసీద్ ప్రాంతంలో స్థానిక కార్పోరేటర్ పడాల శ్రీజ అజయ్ తో కలిసి రూ. 10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. డివిజన్ లోని పలు సమస్యలను తనిఖీ చేసి పరిశీలించారు. చేపట్టిన పనులను వేగవంతంగా నాణ్యత తో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్ కు ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... నగరపాలక సంస్థ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా తమ పాలకవర్గం ముందుకు సాగుతోందని తెలిపారు. 64 వ డివిజన్ అభివృద్ధి కోసం మా పాలకవర్గం యూఐడిఎఫ్ కింద రూ. 50 లక్షలు కేటాయించామని, వాటికి సంబంధించిన పనులను త్వరలోనే ప్రారంభం చేసి పనులు కొనసాగిస్తామని తెలిపారు. ముకరాంపుర ప్రాంతంలో స్టాం వాటర్ డ్రైనేజీ ప్రధాన సమస్యగా మారిందని వర్షకాలంలో వరద నీరు ఇండ్లలోకి చేరడం చాలా సమస్యగా మారిన దృష్ట్యా మురుగు నీటి కాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి స్టాం వాటర్ డ్రైనేజీ అభివృద్ధి కొసం గతంలోనే 5 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. అంతే కాకుండా నగరంలోని ఇతర డివిజన్ల నుండి మురుగు నీటి కాలువ వస్తుంది.



వర్షకాలంలో వరద నీటితో చాలా ప్రాంతాల్లో నీరు ఇండ్లలోకి చేరి సమస్యగా మారడం వల్ల డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం యూసీఎఫ్ స్కీంలో 130 కోట్ల నిధులు కేటాయించి టెండర్ ప్రక్రియ చేపట్టామని తెలిపారు. ముకరాంపుర నుండి బైపాస్ రోడ్డు వరకు వరద నీటి కాలువ అభివృద్ధికి చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు. నగరాన్ని అన్ని రంగాల్లో ప్రజలకు ఎక్కడ ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు రాకుండా పాలకవర్గం ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రణాళిక బద్దంగా అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పడాల శ్రీజ అజయ్, నగరపాలక సంస్థ డీఈ ఓం ప్రకాష్, ఏఈ గట్టు స్వామి మున్సిపల్ సిబ్బంది, డివిజన్ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అసత్య ప్రచారం, పోలీసులపై వ్యక్తిగత ఆరోపణలు.. ఇద్దరు అరెస్ట్

**గంభీరావుపేట, అక్టోబర్ 13 (జనం సాక్షి):** గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 2026 అక్టోబర్ 13న నమోదైన ఓ కేసు విచారణకు సంబంధించి, పోలీసుల దర్యాప్తునకు సహకరించ కుండా, అడిగిన సమాచారాన్ని అందించకుండా, గంభీరావుపేట ఎస్సైతో పాటు ఇతర పోలీసు అధికారులపై అసత్య ప్రచారం చేస్తూ, వ్యక్తిగతంగా కించపరిచేలా వరుస కథనాలు ప్రచురించారని ఆరోపణలపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ఏగ్దం న్యూస్ పత్రిక ఎడిటర్, నిర్వాహకులుగా పేర్కొన్న పోతూరి శేఖర్ (తండ్రి స్వామి, స్వస్థలం నూకలమర్రి, ప్రస్తుతం కరీంనగర్), రాతిపల్లి సంపత్ (తండ్రి ఆశన్న, మంచిర్యాల, ప్రస్తుతం కరీంనగర్)లను మంగళవారం కరీంనగర్‌లో అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు ప్రెస్ నోట్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరిస్తూ.. వార్తలు ప్రచురించే ముందు వాటి పూర్వాపరాలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. వ్యక్తిగతంగా కించపరిచేలా, అసత్య సమాచారంతో వార్తలు రాయడం, సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.




## సమాన పనికి సమాన వేతనం కల్పించాలి:ఎఫ్.ఎం.జి.ల నిరసన..

**సిరిసిల్ల టౌన్ అక్టోబర్ 13 (జనంసాక్షి)** విదేశాల్లో ఎం,బి,బి,ఎస్ పూర్తి చేసి వచ్చిన వారికి ఐ,ఎం, జి ప్రకారంగానే సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వ ఆసుపత్రుల్లో జూనియర్ డాక్టర్లుగా పనిచేస్తున్న డాక్టర్లు డిమాండ్ చేశారు, సిరిసిల్లలోని అంబేద్కర్ చౌక్ వద్ద జూనియర్ డాక్టర్లు ప్లెక్సీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ సర్వీస్ లాగే మేము విదేశాల్లో గత ఆరు సంవత్సరాల కాలంలో అన్ని కాలాలను దాటుకుని ఎం,బి,బి,ఎస్ పూర్తి చేసి వచ్చామని, మేము భారతీయులమేనని మాకు కూడా ఐ,ఎన్,జి,ఎస్ లాగే సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఎంజిలపై చిన్నచూపు చూడకుండా ప్రభుత్వం సమాన వేతనం కల్పించాలని కోరారు. 2023లో సుప్రీంకోర్టు జీవో ప్రకారంగానే 29,792 రూపాయలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చేది నెలకు 5000 మాత్రమే చెల్లించడంతో జీవనం అత్యంత కష్టంగా మారిందన్నారు. ఆ జీతం కూడా ఏడు నెలలకు ఒకసారి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐ ఎం జి ల మధ్య ఎఫ్,ఎం, జి ల మధ్య వ్యత్యాసం చూపడం ఎందుకు అని ప్రశ్నించారు. ఐ,ఎం,జీల,లాగే మేము కూడా డాక్టర్లమే కదా అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ఇచ్చిన సమాన హక్కుల లాగే మాకు కూడా సమాన హక్కులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం కేటాయించిన జీతం 29,792 రూపాయలు అయితే ఇప్పటివరకు మాకు చెల్లించేది 5వేల రూపాయలు మాత్రమే నన్నారు. నెలసరి జీతం కూడా ఏడు నెలలకు ఒకసారి జీతం అందిస్తున్నారని తెలిపారు. 31 మంది జూనియర్ డాక్టర్స్ కి జీతం రాలేదన్నారు. ఎన్.ఎం.జి మార్గదర్శకాలు, సంబంధిత ఉత్తర్వుల ప్రకారం ఐ,ఎం,జి ఇంటర్నల్ తో సమానంగా 29వేల 792 రూపాయలు నెలవారి గౌరవ వేతనం, అలాగే అర్హత ఉన్న




కాలానికి సంబంధించిన బకాయిలు చెల్లించాలని కోరారు.డి ఎం ఈ, ఆరోగ్య శాఖ తెలంగాణ ప్రభుత్వం సమస్యను అత్యవసరంగా పరిష్కరించి ఎఫ్ ఎం జి ఇంటర్నల్ కు సమానమైన స్టైఫండ్ అమలు చేయాలని కోరారు. మెరుగైన వైద్య రగంలో మరిన్ని సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు లింగంపల్లి హరి వెంకటేష్, భగీరథ్, ప్రసన్న, ద్వారక, రూప, హర్షిని, శశికాంత్, ప్రత్యూష, సృజన్, మెర్సీ ,రమ్య, అభిలాష్, గాయత్రి, బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.

## కమాన్ పూర్ లో షీ టీమ్ అవగాహన సదస్సు

**కమాన్ పూర్, అక్టోబర్ 13, (జనంసాక్షి) :** రామగుండం సీపీ ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇంచార్జి ఎస్సై ఎం. లావణ్య ఆధ్వర్యంలో కమాన్ పూర్ గ్రామంలో ఆదివారపు మండల సమాఖ్య మహిళా గ్రూపు సభ్యులకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ.. విద్యార్థులు తెలియని వారి పట్ల ఎలా ఉండాలి, పోక్సో చట్టం గురించి, సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది, విద్యార్థుల ప్రవర్తన నియమావళి గురించి వివరించారు. టీనేజ్ ఏజ్ లో జరిగే మార్పులు, మహిళల భద్రత, ఆన్ లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్ గురించి తెలిపారు. మహిళల రక్షణ కోసం ప్రతిరోజూ బస్టాండ్, ప్రధాన చౌరస్తాలు, జన సమీకరణ ప్రాంతాలు, కళాశాలల వద్ద షీ టీమ్ నిఘా ఉంటుందని, ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు, విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 / 112 నంబర్ కు డయల్ చేయాలని, ఆన్ లైన్ మోసాలకు గురైతే 1930 కి ఫోన్ చేయాలని, మహిళలు ప్రయాణ సమయంలో ట్రావెలింగ్ సేఫ్టీ యాప్ టి సేఫ్ యాప్ వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పద్మ, సీసీ లు బిక్షపతి, మల్లయ్య, షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన మార్కెట్ ఎప్పటికి పూర్తి చేస్తారు..?

**- రానున్న ఎన్నికల్లో మంథని గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తాం - ప్రజలే బుద్ధి చెబుతారు.. బీజేపీ నాయకుల ధీమా**

**మంథని, అక్టోబర్ 13, ( జనంసాక్షి) :** మాటలు చెప్పడంలో పోటీ పడటం.. హామీల అమలులో మాత్రం వెనుకబడటం! ఇదీ మంథనిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల తీరు అని భారతీయ జనతా పార్టీ మంథని పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్, మంథని మండల ప్రధాన కార్యదర్శి సామల అశోక్‌కుమార్ విమర్శించారు. ప్రజలకు హామీలివ్వడంలో ముందుండే ఈ రెండు పార్టీలు అభివృద్ధి పనులను పూర్తి చేయడం లో మాత్రం విఫలమవుతున్నాయని ఆరోపించారు. మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంథని పట్టణంలో శాఖాహార, మాంసాహార మార్కెట్ నిర్మాణం ప్రకటనలు, ప్రారంభోత్సవాలకే పరిమితమవుతోందని మండిపడ్డారు. ఒక నెల శంకుస్థాపన మరో నెల బోరు పనులు.. ఆ తర్వాత పనులు ప్రారంభించినట్లు ప్రకటనలు ఇలా కాలం గడుపుతున్నారే తప్ప, ప్రజలకు అవసరమైన మార్కెట్‌ను పూర్తి చేసి అందుబాటు లోకి తీసుకురావడంపై పాలకులు చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన మార్కెట్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుంది? పనులు పూర్తి చేసి వ్యాపారులకు, ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారా? లేక ఆ స్థలాన్ని మరేదైనా అవసరానికి వినియోగిస్తారా? అని ప్రశ్నించారు. ప్రకటనలతో ప్రజల అవసరాలు తీరవని, అభివృద్ధి పనులు పూర్తయినప్పుడే పాలకుల చిత్తశుద్ధి బయటపడుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో మంథని గడ్డపై భారతీయ జనతా పార్టీ జెండా ఎగుర వేస్తామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. మంథని ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, ప్రజా సమస్యలను పట్టించుకోకుండా హామీలతో కాలం గడుపుతున్న బీఆర్ఎస్,




కాంగ్రెస్ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులు రాజకీయ ప్రకటనలను పక్కనపెట్టి శాఖాహార, మాంసాహార మార్కెట్ నిర్మాణాన్ని వేగవంతం చేసి, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

## విశ్వబ్రాహ్మణ సమాజ ఆత్మగౌరవ ప్రతీక సిరికొండ మధుసూదనాచారి ఘనంగా 71వ జన్మదిన వేడుకలు.. వృద్ధులకు పండ్ల పంపిణీ

**కరీంనగర్ కల్చరల్, అక్టోబర్ 13, ( జనం సాక్షి)** విశ్వకర్మ (విశ్వబ్రాహ్మణ) ఉద్యోగుల సంక్షేమ సంఘం (వేవా) కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభాపతి, ప్రస్తుత శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి 71వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభాపతిగా సిరికొండ మధుసూదనాచారి అందించిన సేవలు విశిష్టమైనవని పేర్కొన్నారు. ప్రజాజీవితంలో ఆయన ప్రస్థానం, నాయకత్వ అనుభవం విశ్వబ్రాహ్మణ సమాజానికి గర్వకారణమని తెలిపారు. ఆయన జీవితం యువత, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, విద్యా, ఉద్యోగ, సామాజిక, రాజకీయ రంగాల్లో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణనిస్తుందని అన్నారు.జన్మదిన వేడుకల్లో భాగంగా కరీంనగర్‌లోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమాన్ని సందర్శించి, అక్కడ నివసిస్తున్న వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులతో ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వేవా జిల్లా అధ్యక్షుడు కట్టా రవీంద్రాచారి, గౌరవాధ్యక్షుడు గద్దె జగదీశ్వరాచారి, కోశాధికారి వెలిచాల వెంకటస్వామి, రాష్ట్ర, జిల్లా నాయకులు కడార్ల రవీందర్, కందుకూరి దయానంద్, బూరుగుపల్లి రవీందర్, కందుకూరి శ్రీనివాస్, పెద్దప్యాట రాజు, అనసూరి నాగభూషణం, వృద్ధాశ్రమ నిర్వాహకుడు వీర మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి ప్రశంసా పత్రాల అందజేత

**కరీంనగర్, క్రైమ్ అక్టోబర్ 13 (జనంసాక్షి) :** విధి నిర్వహణలో విశేష ప్రతిభ, అంకితభావం కనబరిచిన కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన అధికారులు మరియు సిబ్బందిని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమీక్షా కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ గారు పాల్గొని, సిబ్బంది పనితీరును సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, విధుల పట్ల అంకితభావంతో వ్యవహరించడం, బాధ్యతాయుతంగా పనిచేయడాన్ని గుర్తించి సిబ్బందిని ప్రోత్సహించేందుకు ఈ ప్రశంసా పత్రాలను అందజేసినట్లు తెలిపారు.

ప్రశంసా పత్రాలు అందుకున్న వారు:
ఎ. లక్ష్మారెడ్డి – సబ్ ఇన్ స్పెక్టర్
రవి – పోలీస్ కానిస్టేబుల్
అంజయ్య – పోలీస్ కానిస్టేబుల్
సాగర్ – పోలీస్ కానిస్టేబుల్
కీర్తన – మహిళా పోలీస్ కానిస్టేబుల్

రూరల్ సీఐ అభినందనలు: నిరంజన్ రెడ్డి
ప్రశంసా పత్రాలు అందుకున్న ఎస్.ఐ మరియు సిబ్బందిని కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ . నిరంజన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు.






## వివిఎస్ఎస్ నర్సింగ్ విద్యార్థికి ఆర్థిక సహాయం..

**అంతర్గాం, జనంసాక్షి :**
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి సప్తగిరి కాలనీ-రాజీవ్ నగర్ లో నివాసముంటున్న సిరివేన అక్షయ జీఎన్ఎమ్ నర్సింగ్ విద్యార్థికి వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 3 సంవత్సరాల కోర్స్ కు సంబంధించిన ఆర్థిక సహాయం మంగళవారం అందించారు. సహాయాన్ని గోదావరిఖని మేదర్ బస్తిలోని చంద్రశేఖర్ కిరణ మర్చంట్ నిర్వాహకులు సిహెచ్ కిషోర్ తన తండ్రి సిహెచ్ చంద్రశేఖర్ జ్ఞాపకార్థం విద్యార్థి చదువుకోవడానికి ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమానికి గోదావరిఖని ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు పూదరి కుమార్, క్లబ్ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్యాం కుమార్ గౌడ్, వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డా, సురభి శ్రీధర్ లు హాజరై మాట్లాడారు. మూడు సంవత్సరాల పాటు ప్రతినెల 1000 రూపాయలు చొప్పున విద్యార్థి కి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అమ్మాయి తల్లిదండ్రులు అమ్మాయి చిన్న వయసులోనే అనారోగ్యంతో చనిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ అమ్మమ్మ వాళ్ళ ఇంట్లో ఉంటూ విద్యార్థి యొక్క అమ్మమ్మ కూలి పని చేసుకుంటూ చదువుపించడం జరుగుతుందని తెలిపారు. అమ్మాయి చదువు కోసం తమ సంస్థను ఆర్థిక సాయం కోరగా సిహెచ్ కిషోర్ చంద్రశేఖర్ కిరణ మర్చంట్ నిర్వాహకులు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందిస్తామని చెప్పడం జరిగిందని తెలిపారు. విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం చేస్తున్న కిషోర్ కు తమ సంస్థ పక్షాన కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని సురభి శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు ఇజ్జగిరి శ్యాం, క్లబ్ కార్యవర్గ సభ్యుడు బొల్లం మధు తోపాటు విద్యార్థి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## దసరా సెలవుల్లో ఇళ్లకు తాళాలు.. దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

### ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి..

### అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.. సీఐ రవీందర్

**రుద్రంగి అక్టోబర్ 13 (జనం సాక్షి)**
రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం చందుర్తి సిఐ రవీందర్ స్థానిక ఎస్సై మోతిరామ్ తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.....దసరా పండుగ సెలవులను పురస్కరించుకుని సొంతూళ్లకు,బంధువుల ఇళ్లకు, విహారయాత్రలకు వెళ్లే ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సూచించారు. ఇళ్లను ఖాళీగా ఉంచి వెళ్లే సమయంలో విలువైన బంగారు,వెండి ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని తెలిపారు. ఇళ్లకు సీసీ కెమెరాలు, సెక్యూరిటీ అలారాలు ఏర్పాటు చేసుకోవాలని,ద్విచక్ర వాహనాలకు అదనపు తాళాలు వేయాలని సూచించారు. ప్రయాణ వివరాలను సోషల్ మీడియాలో వెల్లడించవద్దన్నారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లే వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామాలు, పట్టణాలు, కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్-112 కు సమాచారం ఇవ్వాలని కోరారు. దసరా సందర్భంగా పోలీసులు విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారని సీఐ రవీందర్ వెల్లడించారు.

## గన్నేరువరంలో ఘనంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

### - అమ్మవారిని దర్శించుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న

**గన్నేరువరం, అక్టోబర్ 13 (జనంసాక్షి):**



గన్నేరువరం మండల కేంద్రంలో యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలతో భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఉత్సవాలలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న దుర్గామాతను దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమ్మవారి ఆశీస్సులతో మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో యువశక్తి ఫౌండేషన్ సభ్యులు, గ్రామ ప్రముఖులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఉద్యమకారుల ధర్నా

**ఇల్లంతకుంట అక్టోబర్ 13(జనం సాక్షి )**
కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఈరోజు ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ఇల్లంతకుంట మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు ధర్నాలో పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. ఇల్లంతకుంట మండల ఫోరం అధ్యక్షుడు బట్టి చంద్రమౌళితో పాటు సింగిరెడ్డి నరసింహారెడ్డి, బొంబాయి రవి, చల్ల నారాయణ, జ్ఞానేశ్వర్ గౌడ్, సురేందర్ రెడ్డి తదితర ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.





## అంతిమయాత్రలో పాడే మోసిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్

**రామగిరి, అక్టోబర్ 13,(జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం నాగేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తాటి శ్రీనివాస్ ప్రమాదవశాత్తు రోడ్డు యాక్సిడెంట్ మరణించగా వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించి అంతిమ యాత్రలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ పాల్గొని పాడే మోచారు. ఈ కార్యక్రమం లో పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి,రామగిరి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోషం, మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, నాగేపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదయ్య, లొంకా కేశసారం సర్పంచ్ వీరగోని రమాదేవి శ్రీనివాస్ గౌడ్ మాజీ సర్పంచ్ లు ఎరుకల ఓదెలు, కొండవేనా ఓదెలు, మాజీ ఉప సర్పంచ్ వేగోలపు శ్రీనివాస్, నాగేపల్లి కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు వేగోలపు సంతోష్, వార్డ్ సభ్యులు భద్రపు శ్రీనివాస్, అనిల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రదీప్, కొండవేన ప్రభాకర్, పోలు హరిష్, నాగేపల్లి కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జాన్కంపేట్ పోలీసు శిక్షణ కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ సదస్సు

**ఎడపల్లి, అక్టోబర్ 13 ( జనంసాక్షి ) :**



టీబీ ముక్త్ భారత్ అభియాన్, జోష్ టీమ్ కార్యక్రమంలో భాగంగా ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జాన్కంపేట్ గ్రామ శివారులోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో క్షయవ్యాధిపై అవగాహన మరియు టీబీ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల్లో టీబీపై అవగాహన పెంపొందించడం, వ్యాధిని ముందస్తుగా గుర్తించడం మరియు క్షయవ్యాధి నిర్మూలనలో సమాజ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డా. దేవి నాగేశ్వరి, డిటిసిఓ లక్ష్మణ్, డే?పిసి ఎండి ఆవున్ అహ్మద్, ఎస్టిఎస్ ఖలీద్, రేడియోగ్రాఫర్ దేవేందర్, టిబి నోడల్ పర్సన్ శైలజ, రాజకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సెక్యూరిటీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి..

◆ సింగరేణి ఆస్తుల పరిరక్షణలో కీలక భూమిక పోషిస్తున్న సెక్యూరిటీ..

◆ బిఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య..



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి యాజమాన్యం సెక్యూరిటీ సిబ్బందికి మెరుగైన పని పరిస్థితులు, భద్రతా సౌకర్యాలు కల్పించాలని,రామగుండం ఏరియా-ఎ ఎస్ ఓ టు జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ కి సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బిఎంఎస్) ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు.అనంతరం యాదగిరి సత్తయ్య మాట్లాడుతు సైన్యంతో సమానంగా విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసినారు.వినతిపత్రంలో సెక్యూరిటీ సిబ్బంది సంక్షేమం, విధి నిర్వహణలో భద్రత, మౌలిక సదుపాయాల మెరుగైన సదుపాయాలు సంబంధించిన పలు డిమాండ్లను ఆయన ప్రస్తావించారు.

**ప్రధాన డిమాండ్లు..**

యూనిఫాం సరఫరా ఎస్ అండ్ పీసీ సెక్యూరిటీ గార్డులందరికీ పూర్తి యూనిఫాం మెటీరియల్‌ను తక్షణమే సరఫరా చేయాలని షిఫ్టుల మార్పిడిని సౌకర్యవంతంగా నిర్వహిస్తూ తగిన విశ్రాంతి సమయం కల్పించాలి,శాశ్వత సెక్యూరిటీ పోస్టులు జీడీకే-1, జీడీకే-2,జీడీకే-2ఏ గనుల వద్ద శాశ్వత సెక్యూరిటీ పోస్టులను ఏర్పాటు చేయాలి,విద్యుత్ కేబుళ్ల క్రమబద్ధీకరణ, జీడీకే-1, జీడీకే-2, జీడీకే-2ఏ, 11ఇంక్లైన్, లాంగ్‌వాల్ షెడ్ ప్రాంతాల్లో కేబుళ్లను క్రమబద్ధంగా అమర్చి ప్రమాదాలుజరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినారు.ఏరియా వర్క్‌షాప్ వద్ద గోడ నిర్మాణం ఏరియా వర్క్‌షాప్ క్యాంటీన్ నుంచి మరుగుదొడ్ల వరకు ఉన్న గోడకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి లేదా గోడ ఎత్తును పెంచాలని,సెంట్రల్ స్క్రాప్ యార్డు పోస్టు మరమ్మతులు సెక్యూరిటీ పోస్టులో దెబ్బతిన్న రూఫింగ్ షీట్లను మార్చి,విద్యుత్ స్విచ్‌బోర్డు బాక్సును సురక్షిత ప్రదేశానికి తరలించాలనిమినీ సీఎచ్‌పీ వద్ద రెండో పోస్టు రెండో సెక్యూరిటీ పోస్టు కోసం షెడ్ నిర్మించి, పిచ్చి మొక్కలను తొలగించి, లైటింగ్, ఫెన్సింగ్ సౌకర్యాలు కల్పించాలని, లాంగ్ వాల్ షెడ్ వద్ద సౌకర్యాలు సెక్యూరిటీ పోస్టు వెనుక ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి, తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని, కేబుళ్లను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేసినారు.2ఇంక్లైన్ వద్ద సిబ్బంది భద్రత బంకర్‌పై పదే పదే ఎక్కడం,దిగడం వల్ల సెక్యూరిటీ సిబ్బందికి కలుగుతున్న శారీరక శ్రమను తగ్గించేలాప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని,ఓసీపీ-5 వద్ద సోలార్ లైట్లు ఓసీపీ-5 కార్యాలయ సెక్యూరిటీ పోస్టు, పీసీ పటేల్ ప్రైవేట్ సెక్యూరిటీ పోస్టుల వద్ద రాత్రి విధులకుసరిపడా సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినారు.ఎంటీఎఫ్ బృందం బలోపేతం భద్రతా పర్యవేక్షణను మెరుగుపరచడానికి మొబైల్ టాస్క్ ఫోర్స్ (ఎం టి ఎఫ్) సిబ్బంది సంఖ్యను పెంచాలని అన్ని గనుల వద్ద రెండో సెక్యూరిటీ పోస్టు అవసరం, విధుల స్వభావం ఆధారంగా ప్రతి గని వద్ద రెండో సెక్యూరిటీ పోస్టును ఏర్పాటు చేయాలని, జీడీకే.నెం.11ఇంక్లైన్ ఉద్యోగులకు సెక్యూరిటీ గార్డ్ ఛార్జ్ విధానం అర్హులైన ఉద్యోగులకు నిబంధనల ప్రకారం ఎస్‌డపీసీ సెక్యూరిటీ గార్డ్ ఛార్జ్ బాధ్యతలు కల్పించేలా విధానాన్ని ప్రవేశపెట్టి, సకాలంలో అమలు చేయాలని డిమాండ్ చేసినారు.సెక్యూరిటీ సిబ్బంది సంస్థలో కీలకమైన భద్రతా బాధ్యతలను నిర్వహిస్తున్నారని, వారికి అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు, యూనిఫాం, తగిన విశ్రాంతి, సురక్షితమైన విధి నిర్వహణ వాతావరణం కల్పించడం యాజమాన్యం బాధ్యత అని యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు.సిబ్బంది సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, సంబంధితఅధికారులు క్షేత్రస్థాయిలోపరిశీలించి,పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరినారు. డిమాండ్లపై సానుకూలంగా స్పందించి,అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా సెక్యూరిటీ సిబ్బంది సంక్షేమాన్ని కాపాడటంతో పాటు సింగరేణి సంస్థ భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏరియా ఉపాధ్యక్షులు కర్రావుల మహేష్, ఏరియా కార్యదర్శి మేడ రామ్మూర్తి, పిట్ కార్యదర్శి పుప్పాల నాగేంద్రప్రసాద్, పల్లె శ్రీనివాస్, తాట్ల లక్ష్మయ్య, పల్లె రవీందర్, నీలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## మొర్రాపూర్ లో భూముల రీసర్వే ప్రారంభం

**ముస్తాబాద్ అక్టోబర్ 13 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలం మొర్రాపూర్ గ్రామంలో తాసిల్దార్ ఎండి ఫారుక్ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు.క్షేత్ర స్థాయిలో భూములను పరిశీలించి, గ్రామ యొక్క సరిహద్దులు, ఏర్పాటు చేసిన తర్వాత, రైతు యొక్క సర్వ నెంబర్ తో పాటు, పాస్ బుక్ లో ఉన్నటువంటి భూమిని హద్దులు ఏర్పాటు చేసి రైతులకు అందిస్తారు. విస్తరణ తదితర వివరాలను సర్వే అధికారి ద్వారా నమోదు చేసి ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్యా రాజు నాయక్,తాసిల్దార్ ఎండి ఫారుక్, జి పి ఓ, సర్వే అధికారి చంద్రమోహన్, సర్వేర్లు, గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

## అత్యవసరంగా రక్తదానం చేసిన యువత

### అభినందించిన పోతుగల్ గ్రామస్తులు

**ముస్తాబాద్అక్టోబర్ 13(జలం సాక్షి):** ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామ యువకులు (భాను,హరిబాబు, సాయిచందు,మహేష్)సిద్దిపేట జిల్లా ఒంటిమామిడి దగ్గరలో ఉన్న ఆర్.విఎం హాస్పిటల్‌లో తాటికొండ వెంకటనర్సయ్యకు అత్యవసర సమయంలో రక్తదానం చేశారు. ప్రాణదాతలుగా నిలవడం చాలా అభినందనీయంఒకరి ప్రాణాన్ని కాపాడటానికి సమయానికి స్పందించి రక్తం అందించడం నిజంగా గొప్ప విషయం. మీ అందరి సామాజిక బాధ్యత మరియు మానవత్వం ఎంతో మెచ్చుకోదగినది. మీలాంటి యువత సమాజానికి ఆదర్శం



## ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడిని కాపాడిన లేక్ అవుట్‌పోస్ట్ హోంగార్డు

### సమయస్ఫూర్తితో వృద్ధుడి ప్రాణాలు కాపాడిన హోంగార్డు వి. అంజనేయులు



**కరీంనగర్, క్రైమ్ అక్టోబర్ 13 ( జనంసాక్షి )** : వ్యక్తిగత సమస్యల కారణంగా ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన బొమ్మిడేని కొమురయ్య (80) అనే వృద్ధుడిని కరీంనగర్ లేక్ అవుట్‌పోస్ట్‌కు చెందిన హోంగార్డు 767 వి. అంజనేయులు సమయస్ఫూర్తితో స్పందించి కాపాడారు.అనంతరం వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. లేక్ అవుట్‌పోస్ట్ ఆర్ఎస్ఐ బి. రమేష్ కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి, వృద్ధుడికి అండగా ఉండాలని, వ్యక్తిగత సమస్యలతో ఇబ్బందులు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కొనేలా సహకరించాలని సూచించారు.ఆపద సమయంలో తక్షణమే స్పందించి ప్రాణాలను కాపాడిన హోంగార్డు వి. అంజనేయులును పోలీసు అధికారులు అభినందించారు.



## సైబర్ నేరాల నివారణకు సాంకేతిక నైపుణ్యాలను వినియోగించాలి

- అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి రక్షణకు తొలి అడుగు.. - రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా..



**గోదావరిఖని, జనంసాక్షి :**
ప్రజలు, ఉద్యోగుల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ఉద్యోగులు, అధికారులకు సైబర్ నేరాలు,ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
పెద్దపల్లి జోన్, రామగుండం సర్కిల్, ఎన్టీపీసీ పోలీసులు, రామగుండం సైబర్ క్రైమ్ పోలీసులు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉ హెడ్ ఆఫ్ ప్రాజెక్ట్ ఫియాజ్ టైయబ్, పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. ఎన్టీపీసీ సంస్థకు, స్థానిక పోలీసులకు మధ్య గత 40?50 సంవత్సరాలుగా కొనసాగుతున్న సత్సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. ఎన్టీపీసీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో కార్యక్రమాల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక, సమన్వయం ఎంతో అవసరమని తెలిపారు.సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ ప్రత్యేక కేంద్రాల ద్వారా వ్యవస్థీకృతంగా మోసాలకు పాల్పడుతున్నారని కమిషనర్ హెచ్చరించారు. అధిక వేతనాలు, ఆకర్షణీయమైన ఉద్యోగాల పేరుతో యువతను ప్రలోభపెట్టి, వారిని సైబర్ నేరాలకు పాల్పడేలా చేస్తున్నారని తెలిపారు.
ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించడం పోలీసుల బాధ్యత అని,యువ ఇంజనీర్లు తమ సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను సైబర్ నేరాల నివారణకు, సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని పిలుపునిచ్చారు.సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సందేహాస్పద సందేశాలు, లింకులు, ఫోన్ కాల్స్ లేదా డబ్బు బదిలీకి సంబంధించిన అభ్యర్థనలు వచ్చినప్పుడు తొందరపడి స్పందించకుండా "ఆగండి.. ఆలోచించండి.. నిర్ధారించుకోండి" అనే విధానాన్ని పాటించాలని సూచించారు.సైబర్ నేరగాళ్లు ప్రజల భయం, అత్యాశ, బలహీనతలు, అత్యుత్సాహాన్ని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. ఇతరులు ఎదుర్కొన్న సైబర్ మోసాల నుంచి పాఠాలు నేర్చుకుని, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే విధానాలకు సంబంధించిన వీడియోలను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించి, ఉద్యోగులు మరియు అధికారులకు అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, సిసిపిఎస్ ఏసీపీ రంగా రెడ్డి, రామగుండం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ కుమార్,ఎన్టీపీసీ ఎస్ఐ వెంకట్, ఎన్టీపీసీ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి.. క్రీడలను ఆదరించాలి

## ఐఎంఏ నిజామాబాద్ స్పోర్ట్స్ మీట్-2026లో వైద్యుల పిలుపు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 జనంసాక్షి :**
మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నిజామాబాద్ శాఖ ప్రతినిధులు పిలుపునిచ్చారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. 'మాదకద్రవ్యాలకు నో చెప్పండి.. క్రీడలకు అవును చెప్పండి.. జీవితాన్ని ప్రేమించండి' అనే నినాదంతో ఐఎంఏ నిజామాబాద్ స్పోర్ట్స్ మీట్?2026లో భాగంగా మంగళవారం నిషిత ఇంటర్నేషనల్ స్కూల్‌లో అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు.సీనియర్ సర్జన్, ఐఎంఏ నిజామాబాద్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ జీవన్ రావు ఈ పోటీలను ప్రారంభించారు. 35?45, 45?55 సంవత్సరాల వయస్సు విభాగాల్లో 100 మీటర్లు, 200 మీటర్ల పరుగుల పోటీలను నిర్వహించారు. వైద్యులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో డాక్టర్ ప్రశాంత్ రెడ్డి, డాక్టర్ దీపక్ రాథోడ్, డాక్టర్ అజ్జా శ్రీనివాస్ తదితరులు స్వర్ణ పతకాలు సాధించారు.ఐఎంఏ నిజామాబాద్ అధ్యక్షుడు డాక్టర్ విశాల్ ఆకుల స్వయంగా 100 మీటర్లు, 200 మీటర్ల పరుగుల పోటీల్లో పాల్గొని తోటి వైద్యులకు స్ఫూర్తిగా నిలిచారు. ఐఎంఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ హరీష్ స్వామి కూడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని రెండు పోటీల్లో ల్యాప్ విజేతగా నిలిచారు.ఈ సందర్భంగా డాక్టర్ విశాల్ ఆకుల మాట్లాడుతూ, క్రీడలు కేవలం పతకాల సాధనకే పరిమితం కావని, ఆరోగ్యకరమైన జీవనశైలికి పునాది వేస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, క్రీడలు, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు.వైద్యులు స్వయంగా క్రీడల్లో పాల్గొనడం ద్వారా సమాజానికి ఆరోగ్యం, వ్యాయామం, వ్యసనరహిత జీవనశైలిపై చక్కని సందేశాన్ని



అందించారని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడలను ఆదరిస్తూ, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ఆరోగ్యం కోసం క్రీడలు.. వ్యసనాలపై పోరాటం..**
జీవితానికి కొత్త ఆశ అనే సందేశంతో ఐఎంఏ నిజామాబాద్ నిర్వహించిన ఈ కార్యక్రమం వైద్యుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు యువతకు ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించేలా సాగింది.

# వైభవంగా మహా చండీ హోమం

## వినాయకనగర్ కాళికామాత ఆలయం వద్ద ఐదు రోజుల పాటు ఆధ్యాత్మిక వేడుకలు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 జనం సాక్షి :** నగరంలోని వినాయకనగర్ కాళికామాత ఆలయం వద్ద మహా చండీ హోమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఐదు రోజుల పాటు జరిగే ఈ మహా హోమం భక్తిశ్రద్ధలతో, వేదమంత్రోచ్ఛారణల నడుమ కొనసాగనుంది. పల్లి కొండ బడ్సీ రమేష్, లావణ్య, శివ, భరత్, రాజీవ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఋగ్వేద ఘనాపాటి బ్రహ్మశ్రీ జోషి మధుసూదన శర్మ పర్యవేక్షణ వహిస్తున్నారు. వేద మంత్రాల పఠనం, ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. లోకకల్యాణం, సకల జనుల శ్రేయస్సు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తూ మహా చండీ హోమాన్ని నిర్వహిస్తున్నారు. చండీమాత అనుగ్రహంతో ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యాలు కలగాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.ఐదు రోజుల పాటు జరిగే ఈ మహా చండీ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# గంగాధర్ క్షేత్రంలో ఘనంగా కుంకుమ పూజ



**ఇల్లంతకుంట అక్టోబర్ 13 (జనంసాక్షి)** మూడవ రోజున దుర్గాదేవి నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని ఇల్లంతకుంట గంగాధర్ క్షేత్రంలో మూగు రాజు శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజను మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.ఇట్టి కార్యక్రమం అనంతరం మూగు రాజుశర్మ ఆధ్వర్యంలో అన్నప్రసాద్ వితరణ జరిగింది.

# కరీంనగర్ రూరల్ మండల స్థాయి సమీక్ష సమావేశం

## వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్

## ప్రజా సమస్యలు - అభివృద్ధి కార్యక్రమాల పై సమీక్ష

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి) :**
మంగళవారం రోజు కరీంనగర్ రూరల్ మండల ప్రజా పరిషత్ లో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ పాల్గొన్నారు. మండల పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, వివిధ శాఖల పనితీరు తదితర అంశాల పై ఈ సమావేశంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని చర్చించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవడంతో పాటు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం పై సమావేశంలో చర్చించారు. గ్రామాల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని



ఈ సమీక్ష సమావేశంలో దృష్టి సారించారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ షర్మిల మేడం, తహసీల్దార్ నర్సింగరావు, ఎంపీడీవో అశోక్, మండల పరిధిలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇందూరు అభివృద్ధికి కొత్త ఊపు.ప్రజా అవసరాలే ప్రాధాన్యం

- ఒక్కో డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం.
- నగర మౌలిక వసతుల బలోపేతానికి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా.
- రూ.20 లక్షలతో డివిజన్లలో అభివృద్ధి పనులు.
- తొమ్మిది వాటర్ ట్యాంకుల నిర్మాణం. ఖిల్లా రామాలయానికి రోప్‌వే ప్రతిపాదన



**నిజామాబాదు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 జనంసాక్షి:**
నగరాభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు. ఇందూరు నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా వివిధ డివిజన్లలో పనులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని 50, 7, 20వ డివిజన్లలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మేయర్, కార్పొరేటర్లతో కలిసి భూమిపూజ నిర్వహించారు. నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు స్పష్టం చేశారు.

**ప్రతి డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు**
నగరంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులకు సముచిత ప్రాధాన్యం కల్పించాలనే ఉద్దేశంతో ఇటీవల నిర్వహించిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ప్రతి డివిజన్‌కు రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ నిధులతో స్థానికంగా అవసరమైన అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ సాధన కోసం ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లామని, త్వరలో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా కొన్ని డివిజన్లలో రూ.కోటి విలువైన పనులు ప్రారంభమయ్యాయని, మరికొన్ని ప్రాంతాల్లో త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని వివరించారు.

**యూజీడీ పనులకు వేగం, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు**
అమృత్-2 పథకం కింద నగరంలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ (యూజీడీ) పనులు కొనసాగుతున్నాయని ధన్‌పాల్ తెలిపారు. ఈ పనులను మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ ఇటీవల సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి తగిన సూచనలు చేసినట్లు వెల్లడించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. నగరంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు.

**తాగునీటి సమస్యకు చెక్, తొమ్మిది వాటర్ ట్యాంకుల నిర్మాణం**
నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇందులో భాగంగా నగరంలో కొత్తగా తొమ్మిది వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ నీటి అవసరాలను తీర్చేలా సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించడంతో పాటు, నగరంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

**ఖిల్లా రామాలయానికి రోప్‌వే పర్యాటక అభివృద్ధిపై దృష్టి.**
ఇందూరు చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచే పురాతన ఖిల్లా రామాలయ అభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా రోప్‌వే ఏర్పాటు చేసే ప్రతిపాదన ముందుకు సాగుతోందని వెల్లడించారు. ఇటీవల ఈ ప్రాజెక్టుకు సంబంధించి అధికారులు, కంపెనీ ప్రతినిధులు ప్రాంతాన్ని సందర్శించినట్లు గుర్తుచేశారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే చారిత్రక ప్రదేశానికి మరింత గుర్తింపు లభించడంతో పాటు పర్యాటక రంగానికి ఊతం లభించే అవకాశం ఉందని భావిస్తున్నారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ కూరగాయల ఉమారాణి, 50వ డివిజన్ కార్పొరేటర్ జగదీష్ కులకర్ణి, 7వ డివిజన్ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్, 20వ డివిజన్ కార్పొరేటర్ న్యాలం సునీత, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోళ్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భిక్కనూరులో పండగ వేల వెలిగి వెలగని సెంట్రల్ లైట్లు అంధకార ఛాయలు!

- లక్షలతో సెంట్రల్ లైట్స్ ఏర్పాట్లు.. మరమ్మత్తులకు నోచుకోని వెలుగులు
- అప్పుడు వెలుగులు.. ఇప్పుడు చీకట్ల మాయం
- బతుకమ్మ,దసరా పండగల సమయంలో వెలుగులు లేక ప్రజలకు తప్పని రాత్రివేళ ఇబ్బందులు





**భిక్కనూరు అక్టోబర్ 13 (జనం సాక్షి):-**
భిక్కనూరు మండల కేంద్రంలో డివైడర్ సెంట్రల్ లైటింగ్ కొరకు లక్షల రూపాయల నిధులతో అప్పుడు ఏర్పాట్లు చేసి కళకళలాడిన పట్టణం.ఇప్పుడు పండుగల వేళ వెలిగివేలుగని డివైడర్ సెంట్రల్ లైట్స్ తో ఇబ్బంది పడుతున్న ప్రజలు. పట్టణాలకు విద్యుత్ దీపాలతో వెలుగులతో కళకళలాడుతుంటే కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రంలో డివైడర్ సెంట్రల్ లైట్లు వెలిగి వెలగకపోవడంతో చీకట్లు అలుముకుంటున్నాయి. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వీధి దీపాలు కొన్ని చోట్ల వెలుగుతున్నప్పటికీ మరి కొన్ని ప్రాంతాల్లో పనిచేయలేకపోవడం వలన స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
ప్రస్తుతం బతుకమ్మ,దసరా పండుగ వేడుకలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాన రహదారులు,కూడళ్లు ప్రజలు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో వెలుతురు ఉండాల్సిన అవసరం ఉంది. అయితే డివైడర్ సెంట్రల్ లైట్లు వెలగకపోవడంతో రాత్రివేళల్లో రహదారులు చీకటిమయంగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
పండుగల సమయంలో మహిళలు, పిల్లలు, వృద్ధులు రాత్రిపూట బయటకు రావాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో వీధి దీపాలు సక్రమంగా పనిచేయకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ సుందరీకరణ కోసం అప్పుడు లక్షల రూపాయలు నిధులతో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు సైతం ఇప్పుడు అవసరమైన సమయంలో వెలగకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.
పాలకవర్గం చూచి చూడనట్లు వ్యవహరించడం.... అధికారులు స్పందించరా?
పండుగల సందర్భంగా పారిశుద్ధ్యం,విద్యుత్ దీపాలు, రహదారుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అధికారులు సెంట్రల్ లైట్ల సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పనిచేయని దీపాలను గుర్తించి మరమ్మతులు చేపట్టడంతో పాటు,రాత్రివేళల్లో ప్రధాన రహదారులన్నీ తగినంత వెలుతురుతో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
పండుగల వేళ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి డివైడర్ సెంట్రల్ లైట్లను పునరుద్ధరిస్తారా? లేక ప్రజలు చీకట్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తుందా? అన్నది వేచి చూడాలి.





## దుర్గాదేవి వద్ద మహా అన్నదాన కార్యక్రమం

**గాంధారి:జనం సాక్షి అక్టోబర్ 13**
గాంధారి మండల కేంద్రంలోని దుర్గా నగర్ కాలనీ లో దుర్గామాత 5 వార్షికోత్సవం సందర్భంగా దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం అన్నపూర్ణ దేవి అవతారంలో దుర్గా యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. దాదాపు ఈ మహా అన్నదాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. అంతేకాకుండా అమ్మవారి దీక్ష తీసుకున్న స్వాములు దాదాపు 100కు పైగా స్వాములకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. దాదాపు 1500 నుంచి 2000 మంది భక్తులు వచ్చి మహా అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు దుర్గా యూత్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గ యూత్ సభ్యులు శ్రీకాంత్, కృష్ణ, ప్రశాంత్, ఆకాష్, పృద్వి,మాల ధరించిన స్వాములు పాల్గొన్నారు.

## భూముల రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి

### రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

### అదనపు కలెక్టర్ రాజాగౌడ్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 జనంసాక్షి :**
భూముల రీసర్వే ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అధికారులను ఆదేశించారు. రీసర్వే సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, భూముల సరిహద్దుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీసర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు.మెండోరా మండలం వెల్గటూర్ గ్రామంలో మంగళవారం రీసర్వే ప్రక్రియపై నిర్వహించిన గ్రామసభలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూముల రీసర్వే ద్వారా సరిహద్దుల వివాదాలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. సర్వే నిర్వహించే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా సమాచారం అందించాలని, వారి సమక్షంలోనే భూముల కొలతలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.రీసర్వేలో ఆధునిక సాంకేతిక పరికరాలను వినియోగిస్తున్నం దున భూముల హద్దుల గుర్తింపు, వివరాల నమోదు ప్రక్రియలో ఎలాం టి పొరపాట్లకు తావివ్వకూడదని సూచించారు. రైతుల భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వే ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని పేర్కొన్నారు.ఈ గ్రామసభలో స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మేజిక్ రాజాకు టీపీఏ సత్కారం

**గోదావరిఖని, జనంసాక్షి :**
స్థానిక ప్రముఖ కళాకారుడు, మోటివేషనల్ స్పీకర్ మేజిక్ రాజాను తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (టీపీఏ) మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో టీపీఏ వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ కార్యక్రమ అతిథులు సోమవారం శాలువాతో ఆత్మీయంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. విద్యార్థులకు స్ఫూర్తిదాయక ఉపన్యాసాలతో ప్రేరణ కల్పిస్తున్న ఆయన సేవలను గుర్తించి ఈ సత్కారం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం-2026 సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో పద్మనాయక ఏసీ హాల్‌లో కృష్ణవేణి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సహకారంతో కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు నిర్వహిస్తున్న పోటీ పరీక్షల శిక్షణ శిబిరంలో జరిగిన కార్యక్రమానికి టీపీఏ వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణార్థులకు మానసిక ఆరోగ్యం ప్రాధాన్యం, పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొనే విధానాలు, భావోద్వేగ సమతుల్యత, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడంపై అవగాహన కల్పించారు. అనంతరం మేజిక్ రాజా ప్రదర్శించిన మాట్లాడే బొమ్మ శిక్షణార్థులను అలరించింది. టీపీఏ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రంగు వేణు కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుమన చైతన్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నారాయణ రావు, టీపీఏ సలహాదారు, కృష్ణవేణి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత కస్తూరి పద్మ చరణ్, గుండేటి యోగేశ్వర్, విన్నర్ ఐకాన్ కాంపిటేటివ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




# కంటేశ్వర్ రైల్వే అండర్‌పాస్ మూసివేత

- 45 రోజుల పాటు ట్రాఫిక్ మళ్లింపు
- అక్టోబర్ 16 నుంచి విస్తరణ పనులు ప్రారంభం.
- వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసుల సూచన



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 జనంసాక్షి:**
నిజామాబాద్ నగరంలోని కంటేశ్వర్ రైల్వే అండర్‌పాస్ విస్తరణ పనుల నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నారు. దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో డబుల్ ట్రాక్ పనుల్లో భాగంగా చేపట్టనున్న ఈ విస్తరణ పనుల కారణంగా ఎన్టీఆర్ చౌరస్తా నుంచి జెడ్పీ చౌరస్తా, కంటేశ్వర్ బైపాస్ వైపు వెళ్లే మార్గంలో ఉన్న ఒకవైపు రైల్వే అండర్‌పాస్‌ను అక్టోబర్ 16 ఉదయం నుంచి సుమారు 45 రోజుల పాటు మూసివేయనున్నారు. ఈ నేపథ్యంలో వాహనదారులు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సూచించారు.నగరంలోకి వచ్చే వాహనాలకు పాత మార్గమే ఆర్మూర్, నిర్మల్, ఆదిలాబాద్, కరీంనగర్, కామారెడ్డి, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి నిజామాబాద్ నగరంలోకి వచ్చే వాహనదారులు కంటేశ్వర్ బైపాస్, మీ సేవ కంటేశ్వర్ మీదుగా ఇప్పటికే పనులు పూర్తయిన మరోవైపు రైల్వే అండర్‌పాస్ గుండా ప్రయాణించాలి. అక్కడి నుంచి ఎన్టీఆర్ చౌరస్తాకు చేరుకుని కుడివైపు మలుపు తీసుకుని రైల్వే స్టేషన్ ముందుగా బస్టాండ్‌కు వెళ్లవచ్చని పోలీసులు తెలిపారు.నగరం నుంచి బయటకు వెళ్లేవారు ఈ మార్గాల్లో వెళ్లాలి.నిజామాబాద్ నుంచి ఆర్మూర్, కరీంనగర్, ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనదారులు దేవీ రోడ్డు రైల్వే ఫ్లైఓవర్‌ను వినియోగించుకోవాలి. అక్కడి నుంచి దుబ్బ శివాజీ విగ్రహం మీదుగా దుబ్బ రోడ్డులో ప్రయాణించి, దుబ్బ చౌరస్తాలోని శ్రీ మహాలక్ష్మి ఆలయం వద్ద ఎడమవైపు మలుపు తీసుకుని ఖానాపూర్ చౌరస్తాకు చేరుకోవచ్చు. అలాగే దుబ్బ చౌరస్తా నుంచి నేరుగా జీజీ కళాశాల 'యూ' టర్న్ వరకు వెళ్లి బైపాస్ మార్గాన్ని చేరుకోవచ్చు. బైపాస్ నుంచి కంటేశ్వర్ డీఎస్ చౌరస్తాకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.హైదరాబాద్, కామారెడ్డి వెళ్లేవారికి మరో మార్గం.హైదరాబాద్, కామారెడ్డి వైపు వెళ్లే వాహనదారులు ఎన్టీఆర్ చౌరస్తా, కోర్టు చౌరస్తా, పులాంగ్ చౌరస్తా మీదుగా మాధవనగర్ రైల్వే గేట్ దాటి, మాధవనగర్ బైపాస్ నుంచి హైదరాబాద్ రోడ్డుకు చేరుకోవచ్చని పోలీసు శాఖ వెల్లడించింది.
బోధన్, బాన్సువాడ, వర్ని మార్గాల్లో యథావిధిగా రాకపోకలు.బోధన్, బాన్సువాడ, వర్ని ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ప్రస్తుతం వినియోగిస్తున్న పాత మార్గాల్లోనే ప్రయాణాలు కొనసాగించాలని పోలీసులు సూచించారు. అండర్‌పాస్ విస్తరణ పనులు సుమారు 45 రోజుల పాటు జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు ముందుగానే తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.





# భిక్కనూరులో గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు: డాక్టర్ యమిమా

## గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారంపై పలు సూచనలు

**భిక్కనూరు అక్టోబర్ 13 (జనం సాక్షి):**
భిక్కనూరు మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు మండలంలోని వివిధ గ్రామాలు పెద్దమల్లారెడ్డి,ఇస్సన్నపల్లి గ్రామాలకు చెందిన గర్భిణీ స్త్రీలను ఆశా కార్యకర్తలు102 వాహనం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వైద్యపరీక్షల కోరకు తీసుకొచ్చారు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ యమిమా గర్భిణీ స్త్రీలకు వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు, ఎత్తు,బరువు రక్తపోటును పరీక్షించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీలను గుర్తించి వైద్యుల సూచనల మేరకు ఐరన్ ఇంజక్షన్లు అందించడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం వైద్యుల పర్యవేక్షణలో ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా గర్భిణీలకు సాధారణ ప్రసవం జరిగేందుకు దోహదపడే తగిన న్యాయమాల గురించి వైద్యురాలు వివరించారు. గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈకార్యక్రమంలో పిహెచ్ఎన్.జానకి హెల్త్ సూపర్వైజర్ రాజమణి,సువర్ణ. రక్తపరీక్షల ల్యాబ్ టెక్నీషియన్ వనశ్రీ, ఎం,ఎల్,హెచ్,పి.ప్రశాంత్. హెల్త్ అసిస్టెంట్ హేమలత,స్వరూప యశోద, సిబ్బంది సతీష్, హెల్త్ సూపర్వైజర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు గాంధారి క్రీడాకారిణి

**గాంధారి జనంసాక్షి :**



ఒకేసారి రెండు జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై చరిత్ర సృష్టించింది. వివరాల్లోకి వెళితే గాంధారి మండలంలోని గుడి వెనక తండా నిరుపేద కుటుంబానికి చెందిన తల్లిదండ్రులైన బానోత్ విఠల్ మంగాదీ బాయి ల కుమార్తె భానోత్ ఉష జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు అభ్యసించింది ఇంటర్మీడియట్ కొయ్యగుట్ట జూనియర్ కాలేజ్ లో విద్యను అభ్యసిస్తున్న ఉష ఇటీవల అక్టోబర్లో 2 తేదీ నుంచి 5వ తేదీ వరకు వేములవాడలో జరిగిన సబ్ జూనియర్ బాలికల కబడ్డీ పోటీలో కామారెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన అద్భుత ప్రదర్శన చేసి జిల్లా జట్టును క్వార్టర్ ఫైనల్ వరకు తీసుకెళ్లింది ఉష ఆట ప్రదర్శనలు చూసిన అధికారులు ఆమెను జాతీయస్థాయి సబ్ జూనియర్ పోటీలకు ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ రాతోడ్ తెలిపారు. అదేవిధంగా అక్టోబర్ 9 నుంచి 12 వరకు ఖమ్మం జిల్లాలోని అశ్వరావుపేటలో జరిగిన జూనియర్ కబడ్డీ పోటీల్లో మరోసారి కామారెడ్డి నుండి ప్రాతినిధ్య వహించిన ఉష ప్రదర్శన అద్భుతంగా ఉండటంతో హామీను జాతీయ సైజు జట్టుకి ఎంపిక చేసినట్లు ఆయన సూచించారు ఎంపికైన ఉష ను కబడ్డీ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా బాధ్యులు భాస్కర్ రెడ్డి రాజన్న కళాశాల ప్రిన్సిపల్ కమల భాయి పిడి సరళ, జానకి గ్రామస్తులు గ్రామ యువకులు ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

# సామాన్యుడి బడ్జెట్‌కు సింగం షాపింగ్ హౌస్ భరోసా!

## ○అందుబాటు ధరల్లో నాణ్యమైన వస్త్రాలు ○కస్టమర్లకు పూర్తి సంతృప్తి!

**కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్13 (జనంసాక్షి)**




పండుగైనా.. పర్వదిన మైనా.. శుభకార్యమైనా.. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వస్త్రాలను అందిస్తూ కస్టమర్ల ఆదరణ పొందుతోంది కామారెడ్డిలోని సింగం షాపింగ్ హౌస్. కుటుంబ సభ్యులందరికీ నచ్చే వస్త్రాలను తమ బడ్జెట్‌కు అనుగుణంగా కొనుగోలు చేసే అవకాశం ఉండటంతో వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నేటి రోజుల్లో పెరుగుతున్న ధరలతో కుటుంబ అవసరాలకు అనుగుణంగా వస్త్రాల కొనుగోలు భారంగా మారుతున్న తరుణంలో.. నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ అందుబాటు ధరల్లో దుస్తులు లభించడం వినియోగదారులకు ఊరటనిస్తోంది. ధరకు తగ్గ నాణ్యత, నచ్చిన వస్త్రాల ఎంపిక, కొనుగోలులో సంతృప్తి వంటి అంశాలు షాపింగ్ హౌస్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ధరల భారం లేకుండా.. నాణ్యతలో రాజీ పడకుండా! సామాన్యుల నుంచి మధ్యతరగతి కుటుంబాల వరకు తమ అవసరాలకు తగిన వస్త్రాలను ఎంపిక చేసుకునేలా సింగం షాపింగ్ హౌస్ అందిస్తున్న అవకాశాలు కస్టమర్లను ఆకట్టుకుంటున్నాయి. అందుబాటు ధరల్లో నాణ్యమైన దుస్తులు కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది మంచి ఎంపికగా నిలుస్తోంది.

# కామారెడ్డిలో ఈ నెల 15న జాబ్ మేళా

## ○10వ తరగతి నుంచి డిగ్రీ వరకు అర్హత..
## ○నెలకు రూ.15 వేల జీతంతో ఉద్యోగావకాశాలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 (జనంసాక్షి)**
కామారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 15వ తేదీ గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో గల గది నంబర్ 121లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నియామకాలు**
ఈ జాబ్ మేళాలో కామారెడ్డిలోని స్వాసంత్ర మైక్రో ఫిన్ లిమిటెడ్ (ాలజీబజీనిబితీజీ మైక్రో ఈతిని ఒబిట.) సంస్థలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ (లోన్ డిస్బర్స్‌మెంట్ అండ్ కలెక్షన్) పోస్టుల భర్తీకి అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. చేరియాల్ బ్రాంచ్‌లో 10 పోస్టులు, రామాయంపేట బ్రాంచ్‌లో 10 పోస్టులు, మాచారెడ్డి బ్రాంచ్‌లో 5 పోస్టులు కలిపి మొత్తం 25 ఖాళీలు ఉన్నట్లు వివరించారు.

**10వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత**
ఈ ఉద్యోగాలకు 10వ తరగతి నుంచి ఏదైనా డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 15,000 జీతంతో పాటు ఇన్సెంటివ్స్ అందించనున్నట్లు వెల్లడించారు. అదనంగా పెట్రోల్ అలవెన్స్, వసతి, భోజన సదుపాయాలు కూడా కల్పించనున్నట్లు తెలిపారు.

**అవసరమైన ధ్రువపత్రాలతో హాజరుకావాలి**
జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటాను రెండు సెట్లలో, విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, ఫోటోలతో పాటు తీసుకురావాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సూచించారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగం పొందాలనుకునే అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 8985612908, 6305743423 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఎం. కిరణ్ కుమార్ తెలిపారు.

# పంచాయతీ రాజ్ నిబంధనలను పాటించాలి

**కమ్మర్పల్లి అక్టోబర్ 13 (జనంసాక్షి)**
నూతన భవనాలు గృహాల నిర్మాణాల్లో పంచాయతీరాజ్ నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టాలని తాపీ మేస్త్రి లకు గ్రామ సర్పంచ్ ఎనుగందుల శైలేందర్ సూచించారు. మంగళవారం రోజున గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామంలోని తాపీ మేస్త్రి లతో సమావేశం నిర్వహించి నూతన భవనాల నిర్మించేటప్పుడు రెండు ఫీట్లు సెట్ బ్యాక్ వదిలి నిర్మాణాలు చేపట్టాలని నిర్మాణ సమయంలో పంచాయతీరాజ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు సకాలంలో అందివ్వాలని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా మేస్త్రీలు నాణ్యతతో పని చేయాలని కోరారు. సమావేశంలో ఉప సర్పంచ్ తక్కురి శేఖర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సౌందర్య వార్డ్ సభ్యులు సురేష్,అజయ్, నాయకులు సదుల్లా,సతీష్, తాపీ మేస్త్రీలు శీను,కిష్టయ్య, శివ,చిన్న బాబు,అజయ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఎస్‌డీఎఫ్ నిధులతో 2వ వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

## పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్

**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 (జనంసాక్షి)** కామారెడ్డి పట్టణ అభివృద్ధి లో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు మున్సిపాలిటీ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని 2వ వార్డులో ఎస్‌డీఎఫ్ (ాఆఈ) నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేం దుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారుల అభివృద్ధితో ప్రజలకు రాకపోకల్లో ఎదురయ్యే ఇబ్బందులను తొలగించడంతో పాటు,



సౌకర్యవంతమైన ప్రయాణానికి అవకాశం కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, వార్డుల వారీగా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని ఆమె స్పష్టం చేశారు. పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ కామారెడ్డి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మోతిలాల్, డీఈ హన్మంత్ రావు, టీపీఓ వినీత్, గూడెం శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కనీస మద్దతు ధర కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- జిల్లాలో 51,400 ఎకరాల్లో పత్తి సాగు - 5,14,000 క్వింటాళ్ల దిగుబడి అంచనా**

**- పత్తి కొనుగోళ్ల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి,అక్టోబర్ 13(జనంసాక్షి) : 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో పత్తి పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. రాములుతో కలిసి పత్తి కొనుగోళ్ల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులు, సీసీఐ ప్రతినిధులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలో 51,400 ఎకరాల్లో పత్తి సాగు జరిగిందని, సుమారు 5,14,000 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అక్టోబర్ రెండో పక్షం నుంచి పత్తి మార్కెట్‌కు రావడం ప్రారంభమై, నవంబర్, డిసెంబర్ నెలల్లో అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.మార్కెట్‌లో కనీస మద్దతు ధర కంటే తక్కువ ధర లభించినప్పుడు రైతులు నష్టపోకుండా సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు.జిల్లాలో పెద్దపల్లి, సుల్తానాబాద్,కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో గుర్తించిన జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఇూజూలు) ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.కనీస మద్దతు ధర, కొనుగోలు కేంద్రాల వివరాలు,పత్తి నాణ్యతా ప్రమాణాలు, అనుమతించబడిన తేమ శాతం గురించి రైతులకు వివరించాలని సూచించారు. పత్తిని పూర్తిగా ఆరబెట్టి, శుభ్రంగా తీసుకురావాలని, నాణ్యమైన పత్తిలో నాసిరకం పత్తిని కలపవద్దని రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.కప్పాస్ కిసాన్ యాప్ ద్వారా రైతుల నమోదు, కొనుగోలు కేంద్రాల ఎంపిక, స్లాట్ బుకింగ్ విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. జిన్నింగ్ మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా స్లాట్లు కేటాయించాలని, క్రాప్ బుకింగ్ ఆధారంగా రైతులను సాధ్యమైనంత వరకు సమీపంలోని కొనుగోలు కేంద్రాలకు మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు.సాఫ్ట్‌వేర్‌లో నిర్దేశించిన సగటు దిగుబడి కంటే వాస్తవ దిగుబడి అధికంగా ఉన్న రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం ఏఈఓలకు వ్యక్తిగత లాగిన్ సదుపాయం కల్పించి, రైతుల అభ్యర్థన మేరకు క్షేత్రస్థాయిలో సాగు విస్తీర్ణం, పంట పరిస్థితి, వాస్తవ దిగుబడిని పరిశీలించి, నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన పత్తి కొనుగోలు పరిమాణాన్ని పెంచే అవకాశం కల్పించాలని తెలిపారు.అలాగే కౌలు రైతులు, నాన్ డిజిటల్లీ సైన్డ్ (ఎన్ డి ఎస్) భూముల సాగుదారులు భూమి రికార్డుల సమస్యల కారణంగా కనీస మద్దతు ధర ప్రయోజనాలను కోల్పోకుండా చూడాలని సూచించారు. ఏఈఓల లాగిన్ ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా అర్హులైన కౌలు రైతులు, ఎన్‌డీఎస్ రైతుల నమోదు, ధ్రువీకరణకు సాఫ్ట్‌వేర్‌లో సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.పత్తి కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తేమ కొలిచే యంత్రాలు,ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు తదితర మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. నిరంతరాయ విద్యుత్ సరఫరాతో పాటు అగ్ని ప్రమాదాల నివారణకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతులు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని, పత్తి కొనుగోళ్ల అనంతరం రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా సీసీఐ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.రైతులు తమ పత్తిని మధ్యవర్తులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని, అర్హత కలిగిన ప్రతి రైతుకు కనీస మద్దతు ధర ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, వ్యవసాయ అధికారులు, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా తూనికలు కొలతల అధికారి రఘువీర్ సింగ్, జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్ కుమార్, మార్కెట్ కమిటీల కార్యదర్శులు, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు,సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జీవో 59, 76 దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలి

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి,అక్టోబర్ 13(జనంసాక్షి) :**
జీవో 59, 76 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఈ నెలాఖరులోగా నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రెవెన్యూ అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములుతో కలిసి రెవెన్యూ అధికారులతో జీవో 59, 76 దరఖాస్తుల పరిష్కారం, రీసర్వే ప్రక్రియ, ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిపై లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జీవో 59, 76 కింద అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత రికార్డులు,అర్హతలను ధ్రువీకరించిన అనంతరం నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ,ఎలాంటి జాప్యం లేకుండా ఈ నెలాఖరులోగా పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత పాటించాలని, ప్రతి దరఖాస్తుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన అవసరమైన దరఖాస్తులను సంబంధిత అధికారులు స్వయంగా పరిశీలించి, అర్హులైన దరఖాస్తుదారులకు నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**- రీసర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలి :** రీసర్వే ప్రక్రియకు సంబంధించి రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వేలో భాగంగా భూముల వివరాలు, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.రీసర్వే ప్రక్రియలో తప్పులకు తావులేకుండా, పారదర్శకంగా పనులు నిర్వహించాలని తెలిపారు. సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పురోగతిని నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు.

**- ఎస్ఐఆర్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి :**
ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ) కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన పత్రాలను నిబంధనల ప్రకారం ధ్రువీకరించాలని తెలిపారు.అర్హులైన ఓటర్లు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు వివరాల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చేపట్టాలని ఆదేశించారు.అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా, అనర్హుల పేర్లు నమోదు కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఓటరు జాబితా సవరణకు సంబంధించి ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలని, అర్హులైన వారు తమ వివరాలను పరిశీలించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజల నుంచి అందే దరఖాస్తులు, అభ్యంతరాలను నిర్దేశిత విధానంలో స్వీకరించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ సమీక్షలో ఆర్డీవో లు గంగయ్య ,సురేష్, తహసిల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మాజీ శాసనసభ స్పీకర్ మధుసుదనా చారి జన్మదిన వేడుకలు

**పెద్దపల్లి,అక్టోబర్ 13(జనంసాక్షి) :**
తెలంగాణ తొలి శాసనసభ స్పీకర్,శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి భవిష్యత్ లో మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలంగాణ ఉద్యమకారుడు పోసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. మధుసూదన చారి జన్మదిన వేడుకలు మంగళవారం పెద్దపల్లి స్ఫూర్తి దివ్యాంగుల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. మధుసూదన చారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ జహంగీర్, శ్రీనివాస్, అన్వేష్, షరీఫ్, మంచు రామస్వామి, నర్సయ్య, రిషి, జబీర్, తదితరులు పాల్గొన్నారు.

# వెట్టిచాకిరీ నిర్మూలనకు చైతన్యం అవసరం

**- పెద్దకల్వలలో ఐజేఎం ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన**

**- బాధితులు 080-69434343 నంబర్‌కు సంప్రదించాలి**

**- స్థానిక నాయకులు గుండావేణ స్వామి**



**పెద్దపల్లి,అక్టోబర్ 13(జనంసాక్షి) :**
సమాజంలో ఇంకా కొనసాగుతున్న వెట్టిచాకిరీ వ్యవస్థపై ప్రజల్లో చైతన్యం తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక నాయకులు గుండావేణ స్వామి పేర్కొన్నారు.ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల పర్యటనలో భాగంగా వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రదర్శిస్తున్న అవగాహన నాటక కార్యక్రమం మంగళవారం పెద్దపల్లి జిల్లాకు చేరుకుంది.స్థానిక నాయకులు గుండావేణ స్వామి ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా కలెక్టర్‌ను,కళాకారులను కోరడంతో మంగళవారం పెద్దకల్వల గ్రామంలో ఈ నాటక ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుండావేణ స్వామి మాట్లాడుతూ సాంకేతికత విప్లవం సాధిస్తున్న ప్రస్తుత కృత్రిమ మేధ యుగంలో కూడా కొన్ని ప్రాంతాల్లో వెట్టిచాకిరీ వ్యవస్థ ఇంకా కొనసాగడం బాధాకరమన్నారు. పలుచోట్ల అమాయక కార్మికులతో పనులు చేయించుకుని జీతాలు ఇవ్వక పోవడం, ముందస్తు రుణాలు లేదా అప్పుల పేరుతో వారిని బలవంతంగా నిర్బంధించి పనులు చేయించడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు పని వదిలి వెళ్లకుండా వారి ధ్రువపత్రాలు,విలువైన వస్తువులను యజమానులు తమ వద్దే పెట్టుకుని తీవ్ర ఒత్తిడికి,బెదిరింపులకు గురిచేస్తున్నారని తెలిపారు.ఇలాంటి అన్యాయాలకు గురవుతున్న బాధితులు అధైర్య పడకుండా తక్షణమే 080-69434343 నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందాలని ఆయన సూచించారు.వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.పెద్దకల్వల గ్రామంలో ఈ నాటక ప్రదర్శన ఏర్పాటుకు అనుమతి కల్పించిన జిల్లా కలెక్టర్‌కు,ప్రదర్శన నిర్వహించిన ఐజేఎం కళాకారుల బృందానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,కళాకారులు,తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు ఆధ్వర్యంలో జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ప్ల కార్డులు కొవ్వొత్తుల ర్యాలీ

**సుల్తానాబాద్,అక్టోబర్ 13(జనంసాక్షి) :**
ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు జిల్లా నాయకులు ముత్యంరావు తాండ్ర అంజయ్య మాతంగి రాజమల్లు ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ప్ల కార్డులు ప్రదర్శించి కొవ్వొత్తుల,ర్యాలీ నిర్వహించారు.

# కేసీఆర్ హయాంలోనే జిల్లా సమగ్ర అభివృద్ధి

## - బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష - ఘనంగా పెద్దపల్లి జిల్లా దశాబ్ది ఉత్సవాలు

**పెద్దపల్లి,అక్టోబర్ 13(జనంసాక్షి) :**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో కేసీఆర్ అభివృద్ధి ఆనవాళ్లను చెరిపివేయడం ఎవరి తరమూ కాదు.అని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష పేర్కొన్నారు.పెద్దపల్లి జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారం దశాబ్ది పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి దేవాలయం చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి,అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా చేరుకుని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బస్టాండ్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్,రామగుండం మాజీ ఎమ్మెల్యే,బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్,పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ దాసరి మమతా రెడ్డి,పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరుమల్ల రాకేష్ కుమార్,జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్,నాయకులు గంట రాములు యాదవ్‌లతో కలిసి బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష పూలమాలలు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.పార్టీ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా బస్టాండ్ కూడలిలో నిర్వహించిన సభలో దాసరి ఉష మాట్లాడుతూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆహ్వాన మేరకు సమావేశంలో పాల్గొన్నా అని ఈ సందర్భంగా మాట్లాడుతూ




కేసీఆర్ ముందుచూపుతో చేపట్టిన జిల్లాల పునర్వ్యవస్థీకరణ,అధికార వికేంద్రీకరణ వల్లే పరిపాలన ప్రజల ముంగిటకు వచ్చి,అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాయని,మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కృషితో కలెక్టరేట్,మెడికల్ కాలేజీ,ట్యాంక్ బండ్,మార్కెట్,గురుకులాల వంటి ఎన్నో అభివృద్ధి పనులు సాధ్యమయ్యాయని గుర్తుచేశారు.పెద్దపల్లి ఖ్యాతిని ప్రపంచ పటంలో నిలిపి లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టులో కేవలం రెండు పిల్లర్ల మరమ్మతులను కూడా పూర్తి చేయకుండా మూడేళ్లుగా సాగదీస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పొట్ట కొడుతోందని ధ్వజమెత్తారు.సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ఆర్చర్ తానిపర్తి చికిత ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణాలు సాధించి 2028 ఒలింపిక్స్‌కు సిద్ధమవుతుంటే, ఖరీదైన పరికరాల కోసం ఆమె తండ్రి భూమిని తాకట్టు పెట్టి అప్పులపాలైనా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేస్తూ,ఆమెకు వెంటనే రూ.5 కోట్ల నజరానాతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ ఒక చరిత్ర,తిరుగులేని శిఖరమని,1300 మంది అమరుల త్యాగాలను స్మరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడి బీఆర్ఎస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు,పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నరకప్రాయంగా బండారికుంట రోడ్డు

### - భారీ వాహనాల రాకపోకలను అడ్డుకోవాలని కలెక్టర్ కు వినతి

**పెద్దపల్లి,అక్టోబర్ 13(జనంసాక్షి) :**
పట్టణంలోని 19వ వార్డు పరిధిలోని బండారికుంట ప్రధాన రహదారి గుండా మితిమీరిన బరువుతో వెళ్తున్న భారీ వాహనాల రాకపోకలను వెంటనే నిలిపివేసి, రోడ్డును పునర్నిర్మించాలని కోరుతూ స్థానిక కాలనీవాసులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ బండారికుంట మార్గానికి ఎలాంటి బైపాస్ రోడ్డు హోదా లేకపోయినప్పటికీ,దళితులు,మైనార్టీలు నివసించే ఇండ్ల మీదుగా భారీ టిప్పర్లు, లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో రహదారి పూర్తిగా ధ్వంసమైందని ఆవేదన వ్యక్తం చేశారు.భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్డు కింద ఉన్న తాగునీటి సరఫరా పైపులు పగిలి నీరంతా రోడ్లపై కాలువలా ప్రవహిస్తోందని, వాహనాల ప్రకంపనలకు ఇండ్ల గోడలు బీటలు వారి ఎప్పుడు కూలిపోతాయోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నామని వాపోయారు.సంబంధిత అధికారుల నిర్లక్ష్య వైఖరి నడుమ రోడ్లపైకి వచ్చి వాహనాలను అడ్డుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రం సమర్పించిన వారిలో బొంకూరి నవీన్,సుద్దాల శ్రీకాంత్,కనకం సాయి,సుద్దాల శ్రీధర్,నల్లాల తేజ,బొంకూరి అజయ్, ముల్కల వేణుతో పాటు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 19వ వార్డు బాధ్యులు మహమ్మద్ షఫీ,గౌస్,నవాబ్, రియాజ్,బొంకూరి భూలక్ష్మి,మొలకల హారిక,కుక్క మల్లీశ్వరి తదితరులు ఉన్నారు.

# అన్నపూర్ణేశ్వరి అవతారంలో దుర్గాదేవి

**సుల్తానాబాద్,అక్టోబర్ 13 (జనంసాక్షి) :**



దుర్గామాత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవరోజు అన్న పూర్ణేశ్వరి అవతారంలో ఉన్నటు వంటి దుర్గామాత కి ఘనంగా పూసాల గ్రామ భక్తులు ప్రజల చేత ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. తదనంతరము నిత్య అన్నదాన ప్రసాద వితరణ చేశారు.ఈ,కార్యక్రమంలో దాదాపు 400 మందికి అన్న ప్రసాద వితరణ చేశారు.ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్క పూసాల సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని భక్తులకు ప్రజలకు అందరి కూడా దుర్గామాత కృప కలిగి ఉండి వారి కుటుంబాలకు అష్టైశ్వర్యాలు ధన కనక వస్తు వాహనాలు కలిగి ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ వలస నీలయ్య, వలస భాస్కర్, పెగడ కిషన్,నల్ల శంకరయ్య,వడ్నాల రమేష్,అడిగొప్పుల లింగమూర్తి,పెగడ అంజయ్య,నల్ల వెంకన్న,కండక్టర్ శంకరయ్య,పూసాల గ్రామ ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్న గురుకుల పాఠశాల విద్యార్థులు

సుల్తానాబాద్,అక్టోబర్ 13(జనంసాక్షి) :
పెద్దపల్లి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పి బన్నీ,పి శివరాం,హనుమకొండ లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో పెద్దపల్లి జిల్లా తరఫున పాల్గొని ప్రతిభ కనబరిచారు.వీరిని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె కోటి, పిడి ప్రసాద్, పి ఈ టి సురేందర్,తదితరులు అభినందించారు.




## తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు

# ప్రతీక బతుకమ్మ పండగ

### - ఆల్ఫోర్స్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

### - ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి

సుల్తానాబాద్,అక్టోబర్ 13(జనంసాక్షి) :
తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు,ఆడపడుచులకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుక గొప్పదని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు.సుల్తానాబాద్ పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజిస్తూ జరుపుకునే బతుకమ్మ పండుగ మన సాంప్రదాయాలకు ప్రతిబింబమని అన్నారు. పలు రకాల పూలతో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ ఆడుకునే ఆనందంగా జరుపుకునే ఈ పండగ తెలంగాణ ప్రజల జీవనశైలిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు.సామాజిక ఐక్యతను చాటిచెప్పే గొప్పతనం బతుకమ్మ పండుగ అన్నారు. విద్యార్థులకు విద్యాబోధన తో పాటు భారతీయ సంస్కృతి తెలంగాణ సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయన్నారు.అందులో భాగంగానే ముందస్తుగా పాఠశాలలో బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. నూతన వస్త్రాలు ధరించిన విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.





# ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ. ఎక్స్రే మిషన్ ఏర్పాటు

### - ముఖ్యఅతిథిగా హాజరైన 14వ వార్డు కౌన్సిలర్ వేగోళం పద్మ అబ్బయ్యగౌడ్

**సుల్తానాబాద్,అక్టోబర్ 13(జనంసాక్షి) :**
ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తూ, ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు 14వ వార్డు కౌన్సిలర్ వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్ తెలిపారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 14వ వార్డు కార్యాలయంలో వార్డు ప్రజల ప్రజల పరీక్షల సౌకర్యార్థమై ఎక్స్రే మిషన్ ఏర్పాటు చేయగా,ముఖ్యఅతిథిగా హాజరై కౌన్సిలర్ వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే మా లక్ష్యం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సమీరా,సూపర్వైజర్ రోజా,ఏఎన్ఎం వినోద,ఆశ కార్యకర్తలు వసంత,పద్మ,తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్తాయి స్విమ్మింగ్ పోటీల్లో 50 మీ బ్యాక్ స్ట్రోక్ లో బంగారు పతనం సాధించిన కేరళ మోడల్ హై స్కూల్ విద్యార్థి

### - అభినందించిన ప్రిన్సిపాల్ సిజ్జు ఎస్ నాయర్

**సుల్తానాబాద్,అక్టోబర్ 13(జనంసాక్షి) :**
మంగళవారం గోదావరిఖని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్తాయి ఎస్ జి ఫ్ స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు.అందులో కేరళ మోడల్ హై స్కూల్ కి చెందిన అండర్ -14 విభాగంలో డి . అగ్రజ్ 6వ తరగతి స్విమ్మింగ్ లో 50 మీటర్ల విభాగంలో బ్యాక్ స్ట్రోక్ లో బంగారు పతకం సాధించారని ప్రిన్సిపాల్ సిజ్జు ఎస్నాయర్ తెలిపారు,వచ్చే నెలలో రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని పెద్దపల్లి జిల్లా ఎస్ జి ఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ తెలిపారు.కేరళ మోడల్ హై స్కూల్ ప్రిన్సిపాల్ సిజ్జు ఎస్ నాయర్ వైస్ ప్రిన్సిపాల్ స్మిత ఎస్ నాయర్,పిటీలు ఎ.అజయ్ డీ.రాజు,ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు అభినందించారు.

# యువత చెడు మార్గాన్ని విడనాడాలి

### - గంజాయి మత్తు పదార్థాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

### - రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు యువత ముందుకు రావాలి

### - అవేర్నెస్ కార్యక్రమంలో సీఐ రంజిత్ రావు

సుల్తానాబాద్,అక్టోబర్ 13(జనంసాక్షి) : నేటి యువత గంజాయి మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,మత్తు పదార్థాలకు లోనై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని, రోడ్డు ప్రమాదాల నివారణకు యువత ముందుకు రావాలని, దసరా, దుర్గమ్మ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సిఐ పొన్నమనేని రంజిత్ రావు ఎస్సై చంద్రకుమార్ సూచించారు.మంగళవారం స్థానిక బ్యాంకెట్ హాల్లో జరిగిన అవగాహన కార్యక్రమానికి సిఐ రంజిత్ రావు ఎస్సై చంద్రకుమార్ హాజరై యువతకు దిశా దశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అశోక్ రెడ్డి తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.అనంతరం వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని,వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉండాలని సూచించారు.

# సింగరేణి కార్మికుల గొంతుక నొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## కొప్పుల ఈశ్వర్, బాల్క సుమన్, కోరుకంటి చందర్ ధ్వజం..



గోదావరిఖని, జనంసాక్షి :
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా, సింగరేణి సంస్థను పూర్తిగా వినాశనం చేస్తూ కార్మికుల ప్రయోజనాలను గాలికి వదిలేశారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రామగుండం సింగరేణి స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించ తలపెట్టిన సింగరేణి కార్మిక గర్జన సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, కోరుకంటి చందర్ తదితరులు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు...

**రూ. 6,324 కోట్లు ఏమయ్యాయి ? కొప్పుల ఈశ్వర్ నిలదీత..**

ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో పక్కన పెట్టామన్న రూ. 6,324 కోట్లు ఏమయ్యాయని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కార్మికుల జీతాలు, సంక్షేమం కోసం ప్రతి నెలా రూ. 4,000 కోట్లు ఓడీ (రాఅ) రూపంలో తెస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం.. ఇంత పెద్ద మొత్తంలో నిల్వలు ఉన్నప్పటికీ మళ్లీ ఓడీలు ఎందుకు తేవాల్సి వస్తోందని నిలదీశారు. ఇది కార్మికులను మోసం చేసే పెద్ద స్కామ్ అని, దీనిపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేసి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**అవినీతి కోసమే కాంగ్రెస్ పెద్దల కక్కుర్తి ? బాల్క సుమన్ ఆరోపణ..**

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ.. సింగరేణి ప్రాంతంలో గత మూడేళ్లుగా కాంగ్రెస్ పాలనలో సంస్థను భ్రష్టుపట్టిస్తున్నారని విమర్శించారు. సోలార్ ప్లాంట్లు, డీజిల్, పెట్రోలు కొనుగోళ్లు, ఓబీ వర్క్స్ టెండర్లు, ఎక్స్‌ప్లోజివ్‌ల కొనుగోళ్లలో విపరీతమైన కుంభకోణాలకు పాల్పడుతూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా కార్మికులను మోసగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు...

**రేపటి కార్మిక గర్జనను విజయవంతం చేయండి.. కోరుకంటి చందర్ పిలుపు..**

రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. రేపు సాయంత్రం 5 గంటలకు గోదావరిఖని సింగరేణి స్టేడియం గ్రౌండ్‌లో జరగబోయే ప్రతిష్టాత్మక సింగరేణి కార్మిక గర్జన సభకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాసువుతారని వెల్లడించారు. నాటి ఉద్యమ కాలంలో కేసీఆర్ సింగరేణి కార్మికులకు భరోసానిచ్చి, తెలంగాణ ఏర్పడిన తర్వాత వారసత్వ ఉద్యోగాలను అందించారని గుర్తుచేశారు. నేడు కార్మికులకు అండగా నిలిచేందుకు, ప్రభుత్వ అక్రమాలను ఎండగట్టడానికి నిర్వహించనున్న ఈ సభకు పారిశ్రామిక ప్రాంత కార్మికులు, ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మండలంలో షురైన ఖరీఫ్ వరి కోతలు

**పంట పొలాల్లో హార్వెస్టర్ల సందడి..**

**కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని రైతుల డిమాండ్..**

**పచ్చివడ్లను విక్రయిస్తున్న రైతులకు అవగాహన కల్పించాలి..**



**చిగురుమామిడి అక్టోబర్ 13(జనంసాక్షి):**
చిగురుమామిడి మండల వ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్ (వానకాలం) సీజన్‌కు సంబంధించిన వరి కోతలు ముమ్మరంగా ప్రారంభ మయ్యాయి. ఈ ఏడాది సకాలంలో కురిసిన వర్షాలు,సాగునీటి లభ్యతతో పంటలు చేతికొచ్చే దశకు చేరడంతో రైతులు కోతల పనుల్లో నిమగ్నమయ్యారు.చిగురుమామిడి మండలంలోని 17గ్రామాల్లో ఈ సీజన్‌లో మొత్తం 21517ఎకరాల్లో వరి పంటను సాగు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి తాటిపల్లి పూర్ణచందర్ రెడ్డి తెలిపారు.అలాగే ప్రత్యామ్నాయ పంటల కింద 429ఎకరాల్లో మొక్కజొన్న పంటను,1288 ఎకరాల్లో పత్తి పంటలను రైతులు సాగు చేశారని పేర్కొన్నారు.ప్రస్తుతం వరి కోత మిషన్లు పొలాల్లో సందడి చేస్తుండటంతో,గ్రామాల్లో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. పంట కోతలు మొదలైనప్పటికీ, ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై స్పష్టత రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోసిన ధాన్యాన్ని రోడ్లపై,కల్లాల్లో ఆరబోయాల్సిన పరిస్థితి నెలకొనేలా ఉందటున్నారు.అకాల వర్షాలు కురిస్తే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.మద్దతు ధర లభించక,కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు తెరుస్తారో తెలియని గందరగోళంలో రైతులు తమ ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకే విక్రయించే పరిస్థితి వస్తోందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం కల్పించే కనీస మద్దతు ధర ప్రయోజనాన్ని రైతులందరూ పొందాలని, ప్రైవేట్ వ్యాపారులకు లేదా దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించి, గిట్టుబాటు ధర కల్పిస్తూ కొనుగోలు ప్రక్రియను త్వరగా ప్రారంభించాలని,పచ్చివడ్లను విక్రయించే రైతులకు అవగాహన కల్పించాలని మండల రైతులు కోరుతున్నారు.

# ముల్కనూర్ సర్పంచ్ ఇంటి ఎదుట మృతదేహంతో పెద్ద ఎత్తున ధర్నా

- **సర్పంచ్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపణ..**
- **ముల్కనూర్ లో ఉద్రిక్తత,రంగంలోకి దిగిన పోలీస్ బాలాగాలు**
- **రమేష్ కుటుంబానికి న్యాయం చేస్తామని ఏసీపీ విజయ్ కుమార్ హామీతో విరమణ..**



**చిగురుమామిడి అక్టోబర్ 13(జనంసాక్షి):**
కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ గ్రామంలో మంగళవారం ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఈ నెల 6న గ్రామంలో స్ట్రీట్ లైట్ రిపేర్ చేస్తూ విద్యుత్ షాక్‌కు గురైన ప్రైవేట్ ఎలక్ట్రిషన్ కత్తెరమల్ల రమేష్ (31), తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతదేహం గ్రామానికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.రమేష్ మృతికి గ్రామ సర్పంచ్ సాంబారి భారతమ్మ, ఆమె భర్త కొమురయ్యలే కారణమంటూ మృతుడి బంధువులు,కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేశారు.తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మాల సంఘం నాయకులతో కలిసి కుటుంబ సభ్యులు మృతదేహంతో సర్పంచ్ ఇంటి ఎదుట పెద్ద ఎత్తున తరలివచ్చి ఆందోళనకు దిగారు.శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా కొత్తపల్లి సీఐ బిల్లా కోటేశ్వర్,చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ తదితరులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.మృతదేహాన్ని సర్పంచ్ ఇంటి దగ్గర నుండి తీసుకెళ్లడంతో పోలీసులు గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.ఈ ధర్నాలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య,పుష్ప,గంట రేణిక,కాడే శంకర్,ఎలుక దేవయ్య, జంగం చంద్రశేఖర్,రుద్రపట్ల చిన్న,ఎర్రోళ్ల కవిత,అరె కిషోర్,లింగం కుమార్,ఎలుక రాజు,మారెళ్ళ మహేష్,కత్తెర మల్ల అంజయ్య,గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉటూర్ గ్రామంలో ఉచిత వైద్య, నేత్ర వైద్య శిబిరం

**కరీంనగర్, క్రైమ్ అక్టోబర్ 13 (జనంసాక్షి )**
లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అక్టోబర్ 8 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న విజన్ వీక్ ఆఫ్ సర్వీస్ కార్యక్రమంలో భాగంగా, లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం సంయుక్తంగా కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఉటూర్ గ్రామంలో ఉచిత వైద్య, నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించాయి.క్లబ్ ట్విన్నింగ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరం ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను అందించడంతో పాటు, కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, దృష్టి లోపాలను ముందుగానే గుర్తించడం, నివారించగల అంధత్వాన్ని అరికట్టడం ప్రధాన లక్ష్యాలుగా చేపట్టారు. శిబిరంలో గ్రామస్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, అవసరమైన ఆరోగ్య సూచనలు అందించారు.ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ చైర్మన్ పెద్ది విద్యాసాగర్ నాయకత్వం వహించగా, కోఆర్డినేటర్ ముద్దసాని ప్రదీప్ రెడ్డి సీనియర్ లయన్ సింగమరాజు ఆసుపత్రి ప్రతినిధి వెంకటాద్రి లయన్ డాక్టర్ తుంగూరి కార్తీక్ పాల్గొని తమ



సేవలను అందించారు.శిబిరానికి అవసరమైన మందులను స్వస్తిక్ మెడికల్ ఏజెన్సీస్ ద్వారా నర్ల సాయి కృష్ణ స్పాన్సర్ చేశారు. వారి సహకారం ద్వారా శిబిరానికి హాజరైన రోగులకు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు తోడ్పాటు లభించింది.లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షులు మ్యాడం శివకాంత్ పటేల్ శరత్ కృష్ణ బట్టు వినోద్ పటేల్ మెతుకు కృష్ణ చైతన్య ఐత సూరజ్ కుమార్ కంభం ప్రసాద్ ఈ సేవా కార్యక్రమానికి తమ సహకారాన్ని అందించారు.
గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం, కంటి ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సమాజ శ్రేయస్సు కోసం సేవా కార్యక్రమాలను విస్తరించడం లయన్స్ క్లబ్‌ల ప్రధాన లక్ష్యమని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. లయన్స్ ఇంటర్నేషనల్ ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు.

# ఆంజనేయస్వామి దర్శించుకున్న జేఎన్‌టీయూ రిజిస్ట్రార్

**జేఎన్‌టీయూ కళాశాలను హైదరాబాద్ ప్రధాన క్యాంపస్‌కు దీటుగా**



**మల్యాల అక్టోబర్ 13 (జనం సాక్షి)**
తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మల్యాల మండలం ముత్యంపేట గ్రామం లోని కొండగట్టు ఆంజనేయస్వామిని మంగళవారం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయలక్ష్మి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు అర్చకులు ఆమెకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు. రిజిస్టర్ ప్రొఫెసర్ జయలక్ష్మి మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ విద్యార్థులకు మరిన్ని అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సాంకేతిక విద్యలో జగిత్యాల జిల్లా జేఎన్‌టీయూ కళాశాలను హైదరాబాద్ ప్రధాన క్యాంపస్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. అత్యాధునిక వసతులు క్యాంపస్‌కు యూనివర్సిటీ హోదా కల్పించే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని,త్వరలోనే ఎంబీఏ వంటి కొత్త కోర్సులను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నామని పేర్కొన్నారు.హైదరాబాద్ ప్రధాన క్యాంపస్ తర్వాత జగిత్యాల (సుల్తానాపూర్) కళాశాలకు ఎంతో ప్రాధాన్యం ఉందని,ఇప్పటికే న్యాక్, ఎన్బీఏ గుర్తింపులు సాధించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు,ఆధునిక భవనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.టీసీఎస్ సహకారంతో మంథనిలో చేపట్టిన ప్రయోగాత్మక ప్రాజెక్టును జగిత్యాలతోపాటు ఇతర అనుబంధ కళాశాలల్లోనూ విస్తరించనున్నట్లు తెలిపారు. జేటీపీఐ,ఎంఎస్ఎంఈ సంస్థల సహకారంతో రోబోటిక్స్,ఏఆర్/వీఆర్, ఎలక్ట్రిక్ వాహనాల సాంకేతికతపై విద్యార్థులకు ప్రత్యక్ష శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.